



తెనాలి: కొలకలూరులో జరిగిన రచ్చబండలో ప్రసంగిస్తున్న షర్మిల

కష్టాల్లో తోడుంటాం

- బాధిత కుటుంబాలకు అండగా పార్టీ
- మృతుల కుటుంబీకులకు ఆర్థిక సహాయం
- తాడికొండ నియోజకవర్గంలో భువనేశ్వరి నిజం గెలవాలి యాత్ర


ఫిరంగిపురం: రేగులగడ్డ గ్రామంలో రూ.3లక్షల చెక్కును అందిస్తున్న భువనేశ్వరి


తాడికొండ: బండారుపల్లిలో బాలయ్య కుటుంబసభ్యులను ఓదార్చుతూ..


తుళ్లూరు: రాయపూడిలో మృతుని కుటుంబసభ్యులకు రూ.3లక్షల చెక్కును అందించి పరామర్శిస్తూ..

తాడికొండ, ఫిరంగిపురం, తుళ్లూరు, ఫిబ్రవరి 8: కార్యకర్తలు, నాయకుల కుటుంబాలు కష్టాల్లో ఉంటే వారికి ఎల్లప్పుడు పార్టీ తోడుగా ఉంటుంది. అధైర్య పడ వద్దు. అండగా ఉంటాం.. అని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి తెలిపారు. నిజం గెలవాలి యాత్రలో భాగంగా గురువారం ఆమె తాడికొండ నియోజకవర్గంలో పర్యటించారు. గతంలో చంద్రబాబు అరెస్టుతో మనస్థాపంతో మృతి చెందిన వారి కుటుంబాలను ఓదార్చి, వారికి ధైర్యం చెప్పి పార్టీ తరపున ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో వారి నివాసాలకు వెళ్లిన భువనేశ్వరి వారి చిత్ర పటాల వద్ద నివాళులు అర్పించారు. ఉండవల్లి నుంచి రోడ్డు మార్గంలో ఆమె తాడికొండ, ఫిరంగిపురం, తుళ్లూరు మండలాల్లో పర్యటించారు. తాడికొండ మండలం బండారుపల్లిలో తూమాటి బాలయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. ఫిరంగిపురం మండలం కండ్రిక శివారు రేగులగడ్డకు చెందిన నల్లజర్ల పెదచెన్నకేశవరావు కుటుంబాన్ని పరామర్శించి ఆయన భార్య లక్ష్మి, కుమారుడు పెదబంగారయ్య, కుమార్తె బాలనరసమ్మలకు రూ.3 లక్షల చెక్కు అందజేశారు. తుళ్లూరుకు చెందిన మోరం సాంబశివరావు, రాయపూడికి చెందిన గోరగంటి మల్లికార్జునరావు, వెంకటపాలేనికి చెందిన లంకా నరసింహారావు కుటుంబాలను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు.

ఘన స్వాగతాలు.. ఆప్యాయంగా పలకరింపులు

నిజం గెలవాలి యాత్రలో భాగంగా పర్యటిస్తున్న భువనేశ్వరికి దారిపొడవునా మహిళల నుంచి ఆత్మీయ స్వాగతం లభించింది. ఆయా గ్రామాల్లో భువనేశ్వరని చూసేందుకు మహిళలు పూలు చల్లి తమ అభిమానాన్ని చాటుకున్నారు. తుళ్లూరు వెళ్లే క్రమంలో గరికపాడులో మహిళలు, వృద్ధులను ఆమె పలకరించి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. గరికపాడు నుంచి వస్తున్న క్రమంలో పనుల్లో నిమగ్నమైన మహిళా కూలీలు భువనేశ్వరి రాకను గమనించి ఆమెను చూసేందుకు పరుగులు తీశారు. పొలాల్లో నుంచి వస్తున్న వారిని గమనించిన భువనేశ్వరి కారును ఆపి వారితో కొద్దిసేపు గడిపారు. పొన్నెకల్లులో మహిళలు భువనేశ్వరికి హారతులతో స్వాగతం పలికారు. తాడికొండ అడ్డరోడ్డు వద్ద నిడుముక్కల, మోతడక గ్రామానికి చెందిన మహిళలు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. తాడికొండలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద, అమరావతి దీక్షా శిబిరం వద్ద మహిళలు, రైతులు, భువనేశ్వరికి పూలతో స్వాగతం పలికారు. ఫిరంగిపురం మండలం కండ్రిక శివారు రేగులగడ్డలో షిరిడీసాయి ఆలయంలో పూజల్లో పాల్గొన్నారు. తుళ్లూరు, రాయపూడి, వెంకటపాలెం గ్రామాల్లో రాజధాని మహిళలు, రైతులు, రైతు కూలీలు భువనేశ్వరికి పూలతో స్వాగతం పలికారు. కార్యక్రమాల్లో భువనేశ్వరి వెంట ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, గుంటూరు జిల్లా, నగర టీడీపీ అధ్యక్షులు తెనాలి శ్రావణ్‌కుమార్, డేగల ప్రభాకర్, గుంటూరు జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు అన్నాబత్తుని విజయలక్ష్మి అమరావతి రైతు జేఏసీ నేతలు పువ్వాడ సుధాకరరావు, గుర్రం చంటి తదితరులు పాల్గొన్నారు.

మంచి చేస్తా..

- రచ్చబండ ద్వారా ప్రజలు కష్టాలు తెలుసుకునేందుకే వచ్చా..!
- నాన్న నడిపిన పార్టీ పగ్గాలు పట్టుకుని మీ సేవకే వచ్చా
- జగనన్న వచ్చాక పరిశ్రమలు లేవు.. ఉద్యోగాలు లేవు
- ఇదే పాలన కొనసాగితే యువకులు రాష్ట్రం విడిచి వెళ్లాల్సిందే
- సంక్షేమం పేరుతో మట్టికుండ ఇస్తూ వెండి కుండ లాగుతున్న ప్రభుత్వం
- రాష్ట్రంలో లిక్కర్, మట్టి మాఫియా, భూదందాలు తప్ప పాలనేలేదు
- కాంగ్రెస్ గెలిస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెస్తాం
- కొలకలూరు రచ్చబండ కార్యక్రమంలో కాంగ్రెస్ ఏపీ చీఫ్ షర్మిల

తెనాలి రూరల్, ఫిబ్రవరి 8: తన తండ్రి మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి రచ్చబండ ద్వారా నేరుగా ప్రజల కష్టాలు తెలుసుకున్నారని, అదే బాటలో తాను కూడా పయనిస్తూ మీ ముందుకు వచ్చానని కాంగ్రెస్ పార్టీ ఏపీ చీఫ్ వైఎస్ షర్మిల అన్నారు. గురువారం మండలంలోని కొలకలూరులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమానికి షర్మిల హాజరయ్యారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం షర్మిల మాట్లాడుతూ తన తండ్రి దివంగత రాజశేఖర్ రెడ్డి ప్రజల కోసం ఎన్నో మంచి కార్యక్రమాలు చేసి ప్రజానాయకుడిగా మిగిలారన్నారు. నాన్న నడిచిన బాటలోనే నడుస్తూ కాంగ్రెస్ పార్టీతో ప్రజలకు మంచి చేస్తానన్నారు. రచ్చబండ కార్యక్రమం ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వారి నోటితోనే విని పరిష్కరించేందుకు తన వంతు కృషి చేయాలని వచ్చానని తెలిపారు. వైసీపీ సర్కార్ ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చలేకపోయిందని ఆరోపించారు. జగనన్న పాలనలో లిక్కర్, మట్టి, ఇసుక, భూదందాలు పెరిగిపోయాయని ప్రజాపాలన గాలికొదిలేశారని విమర్శించారు. తక్కువ ధరలకు భూములు కొని వాటిని పేదల ఇళ్ల పట్టాల పేరుతో వేల కోట్లు కొట్టేశారు. వేలమంది లబ్ధిదారులకు ఇల్లు ఇచ్చామని ప్రచారం చేస్తున్నారు క్షేత్రస్థాయిలో మాత్రం ఇల్లు రాలేదు.. పట్టాలు ఇవ్వలేదని ప్రజలు చెబుతున్నారని అన్నారు. అమ్మఒడి పథకం ద్వారా చదువుకునే ప్రతి బిడ్డకు రూ.15,000 ఇస్తానని ఆ నాడు చెప్పిన జగన్ అధికారంలోకి వచ్చి తరువాత ఒక్క బిడ్డకే ఇస్తామని అది కూడా సంవత్సరానికి రూ.12,000 ఇస్తూ తల్లులను మోసం చేశాడని దుయ్యబట్టారు. మహిళలందరూ గమనించాలని సంవత్సరానికి ఇచ్చే రూ.10వేలు కనీసం కుటుంబ ఖర్చులకైనా సరిపోతాయా.. మరో బిడ్డ ఉన్న తల్లులు ప్రైవేటు స్కూల్‌లో చదివించాలంటే ఫీజులు ఎంత ఖర్చు అవుతాయో ఆలోచించాలన్నారు. జగనన్న ఇచ్చే సంక్షేమ పథకాల లబ్ధి మట్టి కుండ చేతిలో పెట్టి వెండికుండ లాక్కునట్లు ఉందన్నారు. అందుకు పెంచిన ధరలే సాక్ష్యమన్నారు. రాష్ట్రంలో ప్రత్యేక హోదా తెస్తానని చెప్పిన జగనన్న కనీసం పోలవరం ప్రాజెక్టును కొంచెం కూడా ముందుకు నడపలేకపోయారన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకురావడంలో పూర్తిగా విఫలమయ్యారని, ఫలితంగా యువకుల నిరుద్యోగులుగా రాష్ట్రం విడిచిపెట్టి వెళ్ళాల్సి వస్తున్నదన్నారు. ఇదే ప్రభుత్వం కొనసాగితే రాష్ట్రంలో యువకులు పొరుగు రాష్ట్రాల్లో బతుకుదెరువుకు వెళ్లే పరిస్థితి ఉందన్నారు. మెగా డీఎస్సీ అని చెప్పి దగా డీఎస్సీగా చూపారని జగనన్న పాలనను ఎండగట్టారు. రాష్ట్రంలో లిక్కర్, భూదందాలు, ఇసుక మాఫియాలతో రాష్ట్రం అట్టుడుకుతోందని అన్నారు. ఇదే పాలన కొనసాగితే రాష్ట్ర భవిష్యత్తు కనుమరుగైపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ పాలనను జనం గమనించి వచ్చే ఎన్నికల్లో రాజన్న, ఇందిరమ్మ రాజ్యాన్ని అధికారంలోకి తెచ్చుకుందామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ప్రారంభమయ్యే రోజే రాహుల్‌గాంధీతో తొలిసంతకం రాష్ట్రానికి ప్రత్యేక హోదామీద పెట్టిస్తానని ఆమె హామీ ఇచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు చాలా గొప్పదని మంచి చేసే వారికే ఓటు వేయాలన్నారు. ప్రజల నుంచి దోచుకున్న డబ్బులను ఎన్నికల్లో ఖర్చు చేసేందుకు వెనుకాడని అవినీతి పార్టీల నుంచి ప్రజలు నిస్సందేహంగా వారు ఇచ్చే డబ్బులు తీసుకోవచ్చన్నారు. అవి మీ నుంచి దోచుకున్న డబ్బేనని వివిధ రకాల పన్నులు, పెంచిన నిత్యావసరాల ధరలు, కరెంట్ ఇతర వాటి నుంచి వసూలు చేసినవేనని అన్నారు. వచ్చే ఎన్నికల్లో రాజన్నబిడ్డగా తనను గెలిపించుకోవాలని ఆమె కోరారు. తొలుత దివంగత రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి షర్మిల, కాంగ్రెస్ నాయకులు పుష్పాంజలి ఘటించారు. కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీమంత్రి కనుమూరి బాపిరాజు, గుంటూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లింగంశెట్టి ఈశ్వరరావు, మాజీ మంత్రి కేవీపీ రామచంద్రరావు, మాజీ ఎంపీ జేడీ శీలం, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు కొప్పుల రాజు స్థానిక పార్టీ నాయకులు చందు సాంబశివుడు, దారా రామకృష్ణ, పెద్దసంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.


ప్రజలకు అభివాదం చేస్తున్న షర్మిల

ఆశాలపై ఉక్కుపాదం

- ఎక్కడికక్కడ నోటీసులు.. అరెస్టులు
- చలో విజయవాడను అడ్డుకున్న పోలీసులు
- ఎన్నారై సమీపంలో జాతీయ రహదారిపై మెరుపు ధర్నా
- బైఠాయించిన మహిళలను ఈడ్చివేసి స్టేషన్లకు తరలింపు
- వడ్డేశ్వరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆశాల నిర్బంధం


ఆశా కార్యకర్తలను లాగి పడేస్తున్న పోలీసులు


విజయవాడ-గుంటూరు హైవేపై కొలనుకొండ వద్ద రాస్తారోకో చేస్తున్న ఆశా కార్యకర్తలు

మంగళగిరి సిటీ, తాడేపల్లి, ఫిబ్రవరి 8: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశావర్కర్లు చేపట్టిన ఆందోళనపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. సీఐటీయూ అనుబంధ ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ గురువారం చలో విజయవాడకి పిలుపునిచ్చింది. ఈ ఆందోళనకు అనుమతి లేదని ఎక్కడికక్కడ ఆశా వర్కర్లు, సీఐటీయూ నేతలకు పోలీసులు తొలుత నోటీసులు జారీ చేశారు. అయినా చలో విజయవాడకు బయల్దేరగా అరెస్టు చేసి వారిని స్టేషన్లలో నిర్బంధించారు. ఈ క్రమంలో పలుచోట్ల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయం 9 గంటల సమయంలో ఆశా వర్కర్లు వందల సంఖ్యలో మంగళగిరి మండలం చినకాకాని హైజంక్షన్ వద్దకు చేరుకుని ప్రదర్శనగా ఏపీఐఐసీ భవన్‌లోని కార్యాలయం వద్ద ఆందోళనకు సిద్ధమయ్యారు. వీరి ర్యాలీని పోలీసులు అడ్డుకోవడంతో ఎన్నారై ఆస్పత్రి వద్ద గౌతమ బుద్ధ రోడ్డుపై ఆశా వర్కర్లు బైఠాయించి మెరుపు ధర్నాకు దిగారు. మధ్యాహ్నం ఒకటిన్నర వరకు ధర్నా కొనసాగడంతో జాతీయ రహదారిపై పెద్దసంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. దీంతో వారిని బలవంతంగా అరెస్టు చేసి పోలీసు స్టేషన్లు, కల్యాణ మండపాలకు తరలించారు. ఆశా వర్కర్లు ప్రతిఘటించడంతో తోపులాట చోటుచేసుకుంది. దీంతో పలువురు సొమ్మసిల్లి పడిపోగా, గాజులు తదితరాలు గుచ్చుకోవడంతో పలువురి చేతులకు రక్తగాయాలయ్యాయి.

ప్రభుత్వ తీరు దుర్మార్గం

ఆశా వర్కర్ల ఆందోళనపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపి బలవంతంగా అరెస్టులు చేయడం దుర్మార్గమని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశాలచే వెట్టిచాకిరీ చేయించుకుంటున్న ప్రభుత్వం వారి సమస్యల పరిష్కారానికి చొరవచూపడంలేదని విమర్శించారు. వేతనాలు పెంచాలని కోరుతున్న ఆశావర్కర్లను, సీఐటీయూ నాయకురాలు ధనలక్ష్మిని చర్చలకు పిలిచి అరెస్టు చేయడం అన్యాయమని సీఐటీయూ రాష్ట్రకార్యదర్శి సుబ్బరావమ్మ అన్నారు. తాడేపల్లి వద్ద అరెస్టు చేసి దుగ్గిరాల పోలీస్‌స్టేషన్‌కు తరలించిన అనంతరం ఆమె మాట్లాడుతూ అర్ధరాత్రి ఇళ్లలో ఉన్న వారిని మగపోలీసులతో అరెస్టు చేసి తీసుకురావడం దారుణమన్నారు. తమ నాయకురాలు ధనలక్ష్మి ఏమైందో ఇంత వరకూ చెప్పడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మంగళగిరి పోలీసు స్టేషన్‌లో నిర్బంధించిన ఆశా వర్కర్లను టీడీపీ నాయకులు పరామర్శించి సంఘీభావం తెలిపారు. ఆశా వర్కర్లను పోలీసులు అడ్డుకుని అక్రమంగా నిర్బంధించడం దుర్మార్గమైన చర్య అని తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య అన్నారు.

ఎక్కడికక్కడ నిర్బంధకాండ

గుంటూరు(తూర్పు): చలో విజయవాడకు పిలుపులో భాగంగా వెళ్తున వివిధ జిల్లాలకు చెందిన దాదాపు 200మంది ఆశావర్కర్లను మంగళగిరి వద్ద పోలీసులు అడ్డుకుని స్థానిక నగరంపాలెం పోలీసు కల్యాణ మండపానికి తరలించారు.దాదాపు ఆరుగంటల సేపు అక్కడే ఉంచి, వారిని పంపారు. సరిగ్గే అదే సమయంలో ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ధనలక్ష్మిని అరెస్టు చేసి దిశ పోలీసుస్టేషన్‌లో ఉంచారన్న విషయం వారికి తెలిసింది. దీంతో వారు దిశ పోలీసుస్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. తక్షణమే ధనలక్ష్మిని విడుదల చేయాలని నినాదాలు చేశారు. దీంతో ఆమెను విడుదల చేశారు. చర్చలు అని చెప్పి అరెస్టుచేసి దిశ పోలీసు స్టేషన్‌లో 20గంటలు నిర్బంధించారని ఆమె తెలిపారు. చర్చల్లో జరిగిన అంశాలను ఆశాలకు వివరిస్తామన్నా వినకుండా రాత్రి సమయంలో విజయవాడ పోలీసులు అరెస్టుచేశారని వాపోయారు. పోలీసులు వైసీపీకార్యకర్తల్లా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు.

గేట్లకు తాళాలు వేసి నిర్బంధం..

చలో విజయవాడలో భాగంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఆశా వర్కర్లు తాడేపల్లి మండలం వడ్డేశ్వరం ప్రాంతానికి వచ్చి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆగారు. సమాచారం తెలిసిన పోలీసులు విజ్ఞాన కేంద్రం గేటుకు తాళాలు వేసి సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ సహా ఆశా వర్కర్లందరినీ నిర్బంధించారు. దీంతో సీపీఎం నేత దొంతిరెడ్డి వెంకటరెడ్డి, వేముల దుర్గారావు, బూరుగ వెంకటేశ్వర్లు అక్కడకు వచ్చి తాళాలు తీయాలని పోలీసులతో వాదులాటకు దిగారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని అనంతరం గేటు తాళాలు తీశారు. ఈ మధ్యలో కొందరు ఆశాలు గేటు దూకి జాతీయ రహదారిపైకి చేరుకుని వాహనాలను అడ్డుకుని నినాదాలు చేశారు. పోలీసుల తీరును నిరసిస్తూ వడ్డేశ్వరం వద్ద జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. ఎంత సేపటికి వారు నిరసన విరమించకపోవడంతో పోలీసులు బలవంతంగా ఈడ్చివేశారు. శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన కార్యకర్త లక్ష్మి స్పృహతప్పి పడిపోయింది. అనంతరం వారిని తాడేపల్లి పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్లకు తరలించి సాయంత్రం విడుదల చేశారు.


పోలీసులు అరెస్టు చేస్తున్న క్రమంలో సొమ్మసిల్లిన ఆశాలు


గుంటూరు దిశ పోలీస్‌స్టేషన్ వద్ద ఆశా వర్కర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న యూనియన్ ప్రధాన కార్యదర్శి కే ధనలక్ష్మి

రూ.20 లక్షలతో చికిత్సలట!

- నివ్వెరపోతున్న ఆరోగ్య శ్రీ లబ్ధిదారులు
- చికిత్సలు చేయించుకోకున్నా యాప్‌లో డిస్‌ప్లే
- ఆరోగ్యశ్రీ యాప్‌లో ఫ్యామిలీ వివరాలు తప్పుల తడక
- యాప్‌లో సమస్యా లేదంటే ఇదేమైనా కుంభకోణమా?
- లబ్ధిదారుల ప్రశ్నలకు సమాధానం చెప్పలేకపోతున్న అధికారులు

గుంటూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆస్పతికి వెళ్లలేదు.. ఎటువంటి వైద్య చికిత్సలు చేయించుకోలేదు.. అయినా ఇప్పటికే రూ.20లక్షలు వినియోగించేశారు.. ఇక మీకు మిగిలింది రూ.5లక్షలే.. అని ఆరోగ్యశ్రీ యాప్‌లో చూపుతున్న వివరాలతో లబ్ధిదారులు విస్తుపోతున్నారు. అయితే అందుకు సంబంధించి ఎలాంటి హెల్త్‌రికార్డులను యాప్‌లో చూపించడం లేదు. దీనిపై కింది స్థాయి సిబ్బందిని వాకబు చేస్తే మీరు ఆరోగ్యశ్రీ కార్డుని వినియోగించి వైద్యచికిత్స చేయించుకుని ఉంటారని చెబుతున్నారు. తాము ఒక్క రూపాయి వైద్యం కూడా ఆరోగ్యశ్రీ కింద చేయించుకోలేదని లబ్ధిదారులు చెబుతున్నా సిబ్బంది ఆలకించడం లేదు. వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ ట్రస్టు జిల్లా అధికారులు కూడా దీనిపై సమాధానం చెప్పలేకపోతున్నారు. ఈ పరిస్థితుల్లో యాప్‌లో సాంకేతిక సమస్య లేదంటే తమ పేరుతో జరిగిన పెద్ద కుంభకోణమా అన్న అనుమానాలు లబ్ధిదారుల నుంచి వస్తున్నాయి. గత కొద్ది రోజుల నుంచి ఏఎన్‌ఎంలు, వలంటీర్లు ప్రతీ ఇంటికి వెళ్లి స్మార్ట్‌ఫోన్లలో ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేయిస్తున్నారు. అనంతరం తమ ఫోన్‌లో ఆరోగ్యశ్రీ యాప్ లాగిన్ అయి వివరాలు చూస్తూనే లబ్ధిదారులకు కళ్లు తిరిగినంత పని అవుతున్నది. ఇందుకు కారణం మొత్తం క్రెడిట్ రూ.25 లక్షల్లో రూ.20 లక్షలు ఇప్పటికే వినియోగించేసినట్లుగా చూపిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్య సేవలను పెంచడంతో పాటు ప్రతీ కుటుంబానికి రూ.25 లక్షల వరకు ఉచితంగా వైద్యం చేయించుకునే సదుపాయాన్ని కల్పించింది. దీనికి సంబంధించి ఇప్పటికే ఆరోగ్యశ్రీ కార్డులను వలంటీర్ల ద్వారా పంపిణీ చేయించారు. ఎవరికైతే కార్డుల పంపిణీ జరిగిందో వారి ఇళ్లకు వలంటీర్లు/ఏఎన్‌ఎంలు వెళ్లి మీ ఫోన్‌లో ఆరోగ్యశ్రీ యాప్ ఇన్‌స్టాల్ చేసుకుని ఆధార్ వినియోగించి లాగిన్ కావాల్సిందిగా కోరుతున్నారు. అయితే యాప్‌లో చూపుతున్న తమ కుటుంబ హెల్త్‌రికార్డులు చూసుకుని విస్తుబోతున్నారు. ఇందుకు కారణం ఇప్పటికే వైద్యం కోసం రూ.20 లక్షలు వినియోగించేశారని, ఇక కేవలం రూ.5 లక్షల వరకు మాత్రమే వైద్య చికిత్సల కోసం క్రెడిట్ మీ అకౌంట్‌లో అందుబాటులో ఉందని డిస్‌ప్లే అవుతున్నది. దీనిపై ఏ ఒక్కరూ తగిన సమాధానం చెప్పడం లేదు. కొందరు వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ ట్రస్టు జిల్లా అధికారులను సంప్రదించి ఈ విషయం వారి దృష్టికి తీసుకెళ్లగా సాంకేతిక సమస్య వల్ల అలా కనిపిస్తున్నది.. దీనిపై తాము కుస్తీ పడుతున్నామంటున్నారు. కాగా ఇప్పుడు ఆ కార్డు తీసుకుని ఎవరైనా రూ. 10 లక్షలకు పైగా వైద్య చికిత్స కోసం ఆస్పత్రికి వెళితే సమస్యలు తలెత్తే అవకాశం లేకపోలేదు.



వైద్యానికి రూపాయి వినియోగించకపోయినా రూ.20 లక్షలు వినియోగించినట్లు చూపుతున్న ఆరోగ్యశ్రీ యాప్‌లోని హెల్త్ రికార్డు

రాష్ట్ర బడ్జెట్ అంకెల గారడీ

● మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



పిడుగురాళ్ల, ఫిబ్రవరి 8: రాష్ట్ర బడ్జెట్ అంకెల గారడీని తలపించేలా వుందని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అంచనాలు చూస్తే కొండంత.. ఖర్చులు చూస్తే పిసిరంత సామెతలా రాష్ట్ర బడ్జెట్ వుందని మండిపడ్డారు. రూ.13 వేల కోట్ల రెవెన్యూ లోటును రూ.44 వేల కోట్లకు, రూ.35 వేల కోట్ల ద్రవ్యలోటును రూ.60 వేల కోట్లకు పెంచిన ఘనత బుగ్గనదేనన్నారు. పన్నుల బాదుడు తప్ప బడ్జెట్‌లో అభివృద్ధి అంశాలు ఏమీ లేవన్నారు. ప్రస్తుతం ఏపీ అప్పులు 11.58 లక్షల కోట్లు, మద్యం బాండ్లు 16,000 కోట్లు, కార్పొరేషన్ హామీలు 1,10,603 కోట్లు, కార్పొరేషన్ తనఖాలు 94,928 కోట్లు, డిస్కం బకాయిలు 27,284 కోట్లు, కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు 95,400 కోట్లు, ఇలా వైసీపీ హయాంలో రాష్ట్ర అప్పులు రెట్టింపు అయ్యాయన్నారు. 2019లో టీడీపీ తీసుకున్న దానికంటే నాలుగు రెట్లు అధికంగా వైసీపీ ప్రభుత్వం అప్పు తీసుకొని ఏపీని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనత సీఎం జగన్‌దే అన్నారు. రిజిస్ట్రేషన్ చార్జీలను జగన్ సర్కార్ భారీగా పెంచడంతో పాటు విద్యుత్ చార్జీల వడ్డనలో కూడా వైసీపీ ప్రభుత్వం ఎక్కడా రాజీపడలేదన్నారు. విద్యార్థులకు ఇచ్చే ట్యాబ్‌ల్లోనూ వెయ్యి కోట్ల అవినీతి, నాడు-నేడు పేరుతో స్కూళ్లకు రంగులు వేసి రూ.3 కోట్ల అవినీతికి వైసీపీనేతలు పాల్పడ్డారన్నారు. జగనన్న విద్యా దీవెనలో 7 లక్షల మంది విద్యార్థులకు వాత పెట్టారని, మద్యం మీద వచ్చే డబ్బుతో సీఎం జగన్ ప్రభుత్వం నడుస్తుందన్నారు. నాసిరకం మద్యంతో 30 వేల మందిని జగన్ ప్రభుత్వం పొట్టన పెట్టుకుందని ఆరోపించారు. రైతు భరోసా ద్వారా లబ్ధిదారుల సంఖ్యను తగ్గించి సున్నా వడ్డీ పంట రుణాలను రూ.5లక్షల నుంచి రూ.3లక్షలకు కుదించారన్నారు. జీవోనెం.217 ద్వారా మత్స్యకారుల కడుపు కొట్టారని, నేతన్నహస్తం పేరుతో నేతన్నల కుటుంబాలను దగా చేశారన్నారు. సబ్‌ప్లాన్ నిధులు రూ.75 వేల కోట్లు దారి మళ్లించి 30 పథకాలను రద్దు చేశారని యరపతినేని శ్రీనివాసరావు ఆరోపించారు.

మెగా కాదు.. దగా డీఎస్సీ

● రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్



రేపల్లె, ఫిబ్రవరి 8: జగన్‌రెడ్డి వదిలింది మెగా డీఎస్సీ కాదని, దగా డీఎస్సీ అని రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో 50,892 టీచర్ ఖాళీలు ఉంటే 6,100 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వటం నిరుద్యోగులను వంచించటమేనన్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని డీఎస్సీ పేరుతో జగన్‌రెడ్డి కొత్త డ్రామాకు తెరతీశారన్నారు. జనవరి 1న జాబ్‌క్యాలండర్ విడుదల చేస్తారని, నాలుగున్నరేళ్ళలో జగన్ చేసింది ఏమీ లేదన్నారు. నిరుద్యోగుల ఆశలపై నీళ్ళు చల్లేలా మంత్రి బొత్స కల్లబొల్లి మాటలు చెబుతున్నారన్నారు. ఎన్నికల హామీలో భాగంగా చేసిన మెగా డీఎస్సీ జాబ్ క్యాలెండర్ 2.32 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ ఏమయ్యాయనే ప్రశ్నకు జగనే సమాధానం చెప్పాలన్నారు. జగన్ నిర్వాకంతో దేశవ్యాప్తంగా 11శాతం నిరుద్యోగం ఉంటే, ఏపీలో 24శాతం ఉందన్నారు. యువతను వంచించి రాష్ట్రాన్ని నిరుద్యోగ ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనత జగన్‌దేనన్నారు. కల్తీ మద్యం అమ్మకాల్లో మద్యాంధ్రప్రదేశ్‌గా గంజాయి ఉత్పత్తిల్లో రాష్ట్రాన్ని నెం.1గా చేసి గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు.

పాఠశాల విద్య ఆర్జేడీ బాధ్యతల స్వీకారం

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 8: గుంటూరు జోన్ (గుంటూరు, ప్రకాశం, నెల్లూరు) పాఠశాల విద్య ప్రాంతీయ సంచాలకులు బి.లింగేశ్వరరెడ్డి గురువారం డీఈవో కార్యాలయంలో ఆర్జేడీ విభాగంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏపీ ప్రధానోపాధ్యాయ సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు ఎ.తిరుమలేష్, గౌరవాధ్యక్షులు జె.సురేష్‌కుమార్, రాష్ట్ర కేంద్ర సహాధ్యక్షులు గుత్తా శ్రీనివాసరావు, గుంటూరు సీజే మణికుమార్, ప్రధాన కార్యదర్శి ఎన్వీ నాగమణి, తెనాలి డివిజన్ అధ్యక్షులు వీరాస్వామి, ప్రధాన కార్యదర్శి శ్రీధర్, మునిసిపల్ ప్రతినిధులు జిలానిబాషా, శ్రీనివాసరావు, వేణుగోపాలరావు, ఎయిడెడ్ ప్రతినిధి ఎస్.శ్రీనివాసరావు, మహిళా ప్రతినిధి జయప్రద, ఎంఈవో రోజ్‌లాండ్, ఉమ్మడిజిల్లా పరీక్షల బోర్డు సెక్రటరీ లలితప్రసాద్, ఎస్టీయూ నేతలు పెదబాబు, డీకే సుబ్బారెడి, జోసెఫ్ సుధీర్‌బాబు తదితరులు పుష్ప గుచ్చాలు అందజేసి, ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

బడ్జెట్‌లో మోసపు మాటలు, అంకెల గారడీ

● వైసీపీ పాలనలో రూ.11.58 లక్షల కోట్ల అప్పులు
● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు


మార్ఫింగ్ ఫోటోలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జీవీ, అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 8: అంకెలగారడీ, మాయమాటలు, మోసపు మాటలు తప్ప రాష్ట్ర బడ్జెట్‌లో ఏమీ కనిపించడం లేదని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు అన్నారు. గురువారం నరసరావుపేటలోని పల్నాడు టీడీపీ కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చిన తర్వాత రూ.11.58 లక్షల కోట్లు అప్పుల పాలు చేశారని అన్నారు. మరో పక్క జగన్‌మోహన్‌రెడ్డి రూ.4 లక్షల కోట్లపైన దోచుకున్నాడని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి లూటీ వలన రాష్ట్రంలో సంక్షేమం తగ్గిపోయిందని, కేవలం 14 శాతం మాత్రమే సంక్షేమానికి ఖర్చు చేస్తున్నారని అన్నారు. గోదావరి, పెన్నా అనుసంధానం వలన రెండు పంటలు పండిచు కోవచ్చునన్నారు. చంద్రబాబునాయుడు ప్రారంభించిన అనుసంధానం పనులు వైసీపీ ప్రభుత్వం అటకెక్కించిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి నిర్వాకం వలన పల్నాడు, ప్రకాశం జిల్లాల రైతులు పూర్తిగా నష్టపోయారన్నారు. వరికపూడిశల ప్రాజెక్టు శంకుస్థాపనచేసి నిధులు కేటాయించపోవడం ప్రజలను మోసం చేయడమే అన్నారు. రాబోయే టీడీపీ జనసేన ప్రభుత్వంలో వరికపూడిశల కచ్చితంగా పూర్తి చేస్తామన్నారు. డ్రిప్ ఇరిగేషన్‌కు రైతులకు డబ్బులు ఇవ్వకుండా దేశం డ్రిప్ ఇరిగేషన్ రెండవ స్థానంలో ఉందని చెప్పుకోవడాని సిగ్గుందా? అన్నారు. 23వేల టీచరు పోస్టులు ఉంటే కేవలం 6,100 ప్రకటించడం నిరుద్యోగలను వంచించడమే అన్నారు. రాష్ట్రంలో పేటీఎం బ్యాచ్ అరాచక చర్యలు శృతిమించుతున్నాయన్నారు. చంద్రబాబు నాయుడు యోగా చేసిన ఫొటోలను, వీడియోలను మార్ఫింగ్‌చేసి అమిత్‌షా కాళ్ళు మొక్కుతున్నట్లు పెట్టడం అత్యంత దుర్మార్గం, నీచమైన చర్యయని దుయ్యబట్టారు. జగన్‌రెడ్డిలా రాష్ట్రప్రయోజనాలు తాకట్టుపెట్టి సొంత ప్రయోజనాల కోసం ప్రధాని కాళ్ళు పట్టుకోలేదని జీవీ ఆంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ పేటీఎం బ్యాచ్ చర్యలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నన్నెంతో అగౌరవ పరిచారు

● ఏ కార్యక్రమానికి పిలుపులేదు
● నర్సరావుపేటలో జగన్ హామీ నెరవేరలేదు
● ఆత్మీయ సమావేశానికి వచ్చేవారికి బెదిరింపులు
● త్వరలో నిర్ణయాన్ని వెల్లడిస్తా: ఎమ్మెల్సీ జంగా

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 8: ముప్పై ఐదేళ్ల రాజకీయ జీవితంలో ఎన్నడూచూడని అగౌరవాన్ని ఈఐదేళ్లలో చూశానని, అనుభవించానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి తెలిపారు. గురువారం రాత్రి పిడుగురాళ్లలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో జంగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఆనాడు నరసరావుపేటలో జగన్ నాకు మాటిచ్చాడని.. ఎమ్మెల్సీని చేసి ఆ తర్వాత మంత్రివర్గంలో తర పక్కనే కూర్చోబెట్టుకుంటానన్న జగన్ ఆ తర్వాత మాట నిలబెట్టుకోలేదన్నారు. 2019 ఎన్నికలకు ముందే ఎమ్మెల్సీ పదవి జగన్ ఇస్తానన్నా.. ఇప్పుడే ఇస్తే ఎన్నికల్లో తన గెలుపునకు పనిచేయడేమోనని కాసు చెప్పడంతో ఎన్నికల య్యాక మాత్రమే తనకు పదవి ఇచ్చారన్నారు. ఎన్నికల్లో గెలిచాక పిడుగురాళ్లకు వచ్చి ర్యాలీ చేసిన కాసు ఆ కార్యక్రమానికి తనను పిలవలేదన్నారు. నాలుగున్నరేళ్లలో ఏకార్యక్రమానికి పిలుపు లేక పోగా నాకార్యాలయానికి ఎవరినీ రానివ్వకుండా నిఘా పెట్టారన్నారు. అదే విషయాన్ని జగన్‌కు, పార్టీ పెద్దలకు చెప్పినా పట్టించుకోలేదని జంగా ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ ఆనాడు పార్టీ పెడతాడో లేదో తెలియని పరిస్థితుల్లో జగన్ కోసం పిడుగురాళ్ల నుంచి హైదరాబాద్ వరకు పాదయాత్ర చేశానని గుర్తుచేశారు. పార్టీ కోసం పనిచేసిన నన్ను 2019 ఎన్నికల తరువాత నన్ను అన్ని కార్యక్రమాలకు దూరం పెట్టారని జంగా ఆవేదన వెల్లగక్కారు. అంతేకాకుండా నా ఆత్మగౌరవంపై దెబ్బకొట్టడం నన్నెంతో బాధించిందని, తనకు గాని.. గామాలపాడు సర్పంచ్‌గా వున్న నా కుమారుడు సురేష్‌కి కూడా సమాచారం ఇవ్వకుండా ఎలా సమావేశం పెడతారని ప్రశ్నించిన విషయాన్ని గుర్తుచేశారు. మీ పదవి కోసం, సంపాదన కోసం గ్రామాల్లో చిచ్చుపెట్టొద్దని, రెండుసార్లు ఎమ్మెల్యేగా, ప్రస్తుతం ఎమ్మెల్సీగా చేస్తున్నా నియోజకవర్గ అభివృద్ధికి, బడుగు బలహీనవర్గాల శ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తున్న నన్ను ఎన్నో ఇబ్బందులు పెట్టినా ఇప్పటిదాకా ఓర్చుకున్నానన్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు కూడా నా మాట వినే పరిస్థితి లేకుండా చేయడం నన్నెంతో బాధించిందన్నారు. గురజాల ప్రజలకు తానేంటో తెలుసని, నా చివరి శ్వాస వరకు గురజాల అభివృద్ధికి, బడుగు బల హీనవర్గాల సంక్షేమానికే పాటుపడతానని జంగా స్పష్టం చేశారు. ఆత్మీయ సమావేశానికి పలు గ్రామాల నుంచి రానివ్వకుండా భయపెట్టి బెదిరించారని గుర్తుచేస్తూ అలా ఎన్నటికీ బెదిరిపోరని.. ఎదురు తిరిగే రోజులు దగ్గరలోనే వున్నాయన్నారు. ఈదఫా ఎమ్మెల్యే సీటు కేటాయించమని వైసీపీ పెద్దలను అడిగా.... కానీ వినే పరిస్థితి అక్కడ లేదన్నారు. బీసీల ఆత్మగౌరవం దెబ్బతీస్తూ ఆత్మవంచనతో బతకలేరని, రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి బీసీలకు జరుగుతున్న అన్యాయాలను వివరిస్తానని జంగా తెలిపారు. ఆత్మీయుల మనోభావాలను గుర్తుంచుకొని ఓనిర్ణయానికి త్వరలో వస్తానన్నారు. 2009లో గురజాల కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆత్మీయులందరినీ జగన్ దూరం చేసుకుంటున్నాడని, నేను జగన్ అభిమానినే అయినా పరిస్థితి బాగోలేదు. బడుగు బల హీనవర్గాల వారందరం జంగావైపే వుంటామన్నారు. ఆత్మీయ సమావేశానికి గురజాల నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి సుమారు 4వేల మంది హాజరయ్యారు. వేదికపై అత్తోట రామనరసింహారావు, నంద్యాల ధనుంజయరెడ్డి, గుండా శ్రీనివాసరావు, కొత్త సాంబశివరావు,మద్దాళి సుబ్బయ్య, నంద్యాల వెంకటేశ్వరరెడ్డి, ముడేల సుబ్బారెడ్డి, మాశెట్టి పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

బడ్జెట్‌లో పన్నుల బాదుడే..

● మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్

పెదకూరపాడు, ఫిబ్రవరి 8: బుగ్గన బడ్జెట్ అంతా అంకెల గారడీనేనని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బుగ్గన బడ్జెట్ అంచనాలు కొండంత అని, ఖర్చులు పిసరంత అని, రూ.13వేల కోట్ల రెవెన్యూ లోటును రూ.44వేల కోట్లకు, రూ 35వేల కోట్ల ద్రవ్యలోటును రూ.60వేల కోట్లకు పెంచిన ఘనత బుగ్గనదేనన్నారు. పన్నులు బాదుడు తప్ప బడ్జెట్‌లో కొత్త అంశాలేమి లేవని, ప్రస్తుతం ఏపీ అప్పులు రూ.11.58 లక్షల కోట్లని, మద్యం బాండ్లు రూ.16వేల కోట్లు అని, కార్పొరేషన్ హామీలు రూ.1,10,603 కోట్లు అని, కార్పొరేషన్ తనఖాలు రూ.94,928 కోట్లు అని, డిస్కం బకాయిలు రూ.27,284 కోట్లు అని, కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు రూ.95,400 కోట్లు అని వివరించారు. వైఎస్‌ఆర్ సీపీ హయాంలో రెట్టింపు అయిన ఏపీ అప్పులు, 2019లో టీడీపీ తీసుకున్న దాని కంటే నాలుగు రెట్లు అప్పు ఎక్కువ అని ఆయన వివరించారు. అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా ఏపీని మార్చిన జగన్ అండ్ కో వైసీపీ హయాంలో తీసుకు వచ్చిన ప్రతి స్కీమ్ ఓ స్కామ్‌గా మారిందని కొమ్మాలపాటి అన్నారు.



పాదయాత్రలో నాగమల్లేశ్వరరావు తదితరులు

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

● జాతీయ దోబీ మహా సంఘం అధ్యక్షుడు నాగమల్లేశ్వరరావు

గుంటూరు, ఫిబ్రవరి8: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే వరకు మహా ఉద్యమాన్ని చేపడతామని జాతీయ దోబీ మహా సంఘం జాతీయ అధ్యక్షుడు అన్నవరపు నాగమల్లేశ్వరరావు పేర్కొన్నారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలన్న డిమాండ్‌తో తిరుపతి నుంచి విజయవాడకు పాదయాత్ర చేపట్టిన ఆయన గురువారం సాయంత్రం చుట్టుగుంట సెంటర్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ తాను చేపట్టిన పాదయాత్ర 19వ రోజుకు చేరిందని, ఇప్పటివరకు 452కిలోమీటర్ల వరకు పాదయాత్ర చేసినట్లు ఆయన తెలిపారు. 1950లో కేంద్రప్రభుత్వం గెజిట్లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఉన్నప్పుడు రజకులు ఎస్సీ జాబితాలో ఉన్నారని గుర్తుచేశారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే అంశాన్నే వచ్చే ఎన్నికల్లో అన్ని రాజకీయ పక్షాలు తమ మేనిఫెస్టోలో పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రజకసంఘాల నేతలు పాల్గొన్నారు.

దేవదాయ శాఖలో ఉద్యోగోన్నతులు

● గుంటూరు డీసీగా మహేశ్వర్‌రెడ్డి

గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవరి 8: దేవదాయ శాఖలో పలువురికి ఉద్యోగోన్నతి కల్పిస్తూబుధవారం రాత్రి రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఉత్తర్వులు జారీచేశారు. గుంటూరు జిల్లాలో ఇన్‌చార్జి డీసీగా ఉన్నా ఈ.చంద్రశేఖర్‌రెడ్డి హెడ్ ఆఫీస్‌కి రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. గుంటూరు జిల్లా ఎండోమెంట్ ఏసీ బొంతు మహేశ్వర్ రెడ్డిని గుంటూరు రీజియన్ రెగ్యులర్ డీసీగా నియమించారు. అదేవిధంగా ఎన్టీఆర్ జిల్లా నెమలిలో ఉన్న ఆలయ ఏసీని డీసీగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానానికి ఈవోగా నియమించారు. ప్రకాశం జిల్లా సింగరకొండ నరసింహస్వామి దేవస్థానం ఈవోగావున్న కేబీ శ్రీనివాసరావుకు డీసీగా పదోన్నతిస్తూ అదే ఆలయంలో కొనసాగాలని ఆదేశించారు. పొన్నూరు భవన్నారాయణ స్వామి దేవస్థానం ఈవో రవణమ్మను శ్రీశైలం దేవస్థానం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ అధికారిగా బదిలీ చేశారు.


సీఎం కాన్వాయ్ వెళ్లేటప్పుడు మందడం శిబిరం వద్ద నినాదాలు చేస్తున్న రైతులు

ఐదేళ్ళుగా అబద్ధాల పాలనే..

● మూడు ముక్కల ఆటతో ఇప్పటికే 20 సంవత్సరాలు వెనక్కి
● రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన సీఎం జగన్‌రెడ్డి
● 1514 రోజుకు చేరిన రైతుల ఆందోళనలు

తుళ్ళూరు ఫిబ్రవరి 8: పోలవరం పూర్తి చేస్తాం.. అమరావతిని బ్రహ్మాండంగా కడతాం.. మద్యాన్ని నిషేధిస్తామని సీఎం జగన్‌రెడ్డి ఐదేళ్లగా అబద్ధాలతో పాలన చేస్తున్నాడని రాజధాని అమరావతి నిర్మాణానికి భూములు త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతుకూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళలు గురువారం నాటికి 1514వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ.. అమరావతిని నిర్వీర్యం చేస్తూ, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి, 20 సంవత్సరాలు వెనకబాటుతనానికి సీఎం జగన్‌రెడ్డి గురి చేశాడన్నారు. అమరావతి అభివృద్ధి కొనసాగింపుతో లక్షల కోట్లు సంపద రాష్ట్రానికి వచ్చేదన్నారు. మూడుముక్కల ఆటతో అది కూడ లేకుండా చేశాడన్నారు. అసెంబ్లీ సమావేశాల చివరిరోజు సీఎం జగన్ కాన్వాయ్ మందడం ధర్నా శిబిరం మీదుగా వెళుతున్న సమయంలో రైతులు బైబై సీఎం అంటూ నినాదాలు చేశారు. ధర్నా శిబిరం నుంచి రైతులు బయటకు రాకుండా పోలీసులు భారీగా మోహరించారు. రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలింగించి జై అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు.

విష్ణుపురం-మోటుమర్రి రైల్వే డబ్లింగ్‌కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం

● రూ. 1,746.20 కోట్ల నిధుల మంజూరు
● కాజీపేట మార్గానికి ప్రత్యామ్నాయ మార్గంగా సేవలు

గుంటూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): విష్ణుపురం - మోటుమర్రి రైల్వే సింగిల్‌లేన్‌ని డబ్లింగ్ చేసేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. కాజీపేట మార్గానికి ఇది ప్రత్యామ్నాయంగా ఉపయోగపడనుండటంతో ఈ నిర్ణయాన్ని తీసుకొన్నది. ఇప్పటికే నల్లపాడు - బీబీనగర్ డబ్లింగ్ ప్రాజెక్టుకి ఈఏడాది బడ్జెట్‌లో నిధులను కేటాయించిన రైల్వే శాఖ తాజాగా 88.82 కిలోమీటర్ల విష్ణుపురం-మోటుమర్రి సెక్షన్ డబ్లింగ్‌కు నిధులు కేటాయించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమౌతుంది. ఈ డబ్లింగ్ ప్రాజెక్టు వలన సరుకు రవాణ గణనీయంగా పెరగనుంది. అలానే కాజీపేట మార్గంలో రైళ్ల రద్దీ కూడా తగ్గుతుందని రైల్వేవర్గాలు చెబుతున్నాయి. విష్ణుపురం సమీపంలో 4వేల మెగావాట్ల యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణం జరుగుతున్నది. అలానే చుట్టుపక్క అనేక సిమెంట్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఎఫ్‌సీఐ సైడింగ్‌లు, వేర్‌హౌస్‌లు, కోల్డ్‌స్టోరేజ్‌లు, ఇనుము, ఉక్కు పరిశ్రమలు ఉండటంతో రాబోయే రోజుల్లో ఇదొక సరుకు రవాణ హబ్‌గా మారనుంది. దీనిని పరిగణనలోకి తీసుకొన్న కేంద్ర ప్రభుత్వం విష్ణుపురం - మోటుమర్రి సెక్షన్ డబ్లింగ్‌ని ఆమోదించింది. ఇందుకోసం రూ. 1,746.20 కోట్లు కేటాయించింది.

10.87 కిలోమీటర్ల పొడవునా రైల్ వోవర్ రైలు ..

డబ్లింగ్ చేపట్టనున్న ఈ సెక్షన్‌లో 10.87 కిలోమీటర్ల పొడవునా రైల్ వోవర్ రైలుని కూడా నిర్మించనున్నారు. ఇప్పటికే మోటుమర్రి ఒక జంక్షన్‌గా మారింది. దీంతో అక్కడ రైల్ వోవర్ రైల్ నిర్మించకపోతే రైళ్ల క్రాసింగ్‌ల సమస్య తలెత్తే అవకాశంవుంది. ఈ నేపథ్యంలో రైల్వే శాఖ ఆర్‌వోఆర్‌ని నిర్మించాలని నిర్ణయించింది.

గిరిజన విద్యార్థుల మృతి సీఎంకు పట్టదా ?

● టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధారూనాయక్

గుంటూరు, ఫిబ్రవరి 8: ఏడాదిలో 40 మంది గిరిజన విద్యార్థులు మృతి చెందుతుంటే సీఎం జగన్ రెడ్డికి పట్టదా? అని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధారూనాయక్ ప్రశ్నించారు. ఈ మేరకు గురువారం గుంటూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. చిట్టంపాడు గిరిజన బాలిక మరణంపై సెంట్రల్ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. జగన్ రెడ్డి ప్రభుత్వంలో గిరిజనులకు డోలీల కష్టాలు తీవ్రమయ్యాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఐదేళ్ల అధికారం పూర్తి కావస్తున్నా జగన్ రెడ్డి ఏజెన్సీ గిరిజన గ్రామాలలో ఒక్క రోడ్డు కూడా వేయలేదన్నారు. రోడ్లు లేక, వైద్యం అందక గిరిజనులు మృత్యువాత పడుతున్నారన్నారు. జగన్ రెడ్డి నిర్లక్ష్య ధోరణితో నేడు ఏజెన్సీ గిరిజన గ్రామాల్లో ఆదిమకాలం నాటి పరిస్థితులు దర్శనమిస్తున్నాయి. టీడీపీ ప్రభుత్వం గిరిపుత్రులనే హెల్త్ అసిస్టెంట్లను నియమిస్తే వారినీ తొలగించారు. గిరిజన గూడేల్లో హెల్త్ చెకప్‌లను నిలుపుదల చేశారని మండిపడ్డారు. గిరిజన హాస్టళ్లలో గత ఏడాది నుంచి నేటి వరకు రాష్ట్రంలో దాదాపు 40 మంది గిరిజన విద్యార్థులు అనారోగ్యాల బారినపడి మృత్యువాత పడ్డారన్నారు. ఇటీవల విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలం, గిరిశిఖర గ్రామం, చిట్టంపాడుకు చెందిన ఆరేళ్ల బాలిక అనారోగ్యంతో మరణించిడం తీవ్రంగా కలచివేసిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

10న నవోదయ ప్రవేశ పరీక్ష

చిలకలూరిపేట,ఫిబ్రవరి8: చిలకలూరిపేట మండలం మద్దిరాలలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయంలో 2024 - 25 సంవత్సరంలో 9, 11 తరగతుల్లో ప్రవేశానికి ఈనెల 10వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు గురువారం తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 9వ తరగతి ప్రవేశ పరీక్షకు 950 మంది, 11వ తరగతి ప్రవేశ పరీక్షకు 582 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్‌తో పాటు ఆధార్ కార్డును తీసుకొని నిర్ణీత సమయంలో కేటాయించిన పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కోరారు. హాల్ టిక్కెట్లు లేని వారు నవోదయ వెబ్‌సైట్ నుంచి నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని కూడా ఆయన తెలిపారు.

ఎన్నికల సభలా ఆసరా చెక్కుల పంపిణీ

కొల్లూరు, ఫిబ్రవరి 8: ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం ట్రాఫిక్ మళ్లించి మరీ నడిరోడ్డుపై నిర్వహించడం పలు విమర్శలకు దారి తీసింది. గురువారం మండల కేంద్రం కొల్లూరులో మండల వనరుల కేంద్రం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు తెనాలి-రేపల్లె ప్రధాన రహదారిపై ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. ఇందుకోసం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి వాహన రాకపోకలు నిలిపి వేసి ఇతర మార్గాల్లో ట్రాఫిక్ మళ్లించారు. వైసీపీ నాయకులు దీనిని ఎన్నికల ప్రచార సభలాగా వినియోగించుకున్నారు. మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తేనే సంక్షేమ పథకాలు అందుతాయని, లేదంటే అందవని మహిళలను భయపెట్టే విధంగా మంత్రి మేరుగు నాగార్జున, ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబుల ప్రసంగం ఉందని, ప్రభుత్వ కార్యక్రమమా! ఎన్నికల ప్రచారమా అని పలువురు ఆరోపిస్తున్నారు. పైగా వేలిముద్రలు వేయాలని డ్వాక్రా మహిళలను, ఇళ్ల స్థలాలు పొందిన వారిని మభ్యపెట్టి సభకు రప్పించారని మహిళలే సభా ప్రాంగణం వద్ద బహిరంగంగానే చెబుతుండటం గమనార్హం. మధ్యాహ్నం 1 గంటకు సభ అని పిలిపించి రాత్రి 7 గంటలకు పైగా అక్కడే ఉండేలా చేయడంతో కార్యక్రమానికి వచ్చిన మహిళలు అసహనానికి గురయ్యారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

● పాత నేరస్తుడిగా గుర్తింపు ● మృతుడు ప్రకాశం జిల్లా వాసి

వేమూరు, ఫిబ్రవరి 8: మండలంలోని జంపని గ్రామ శివారులో ఉన్న సినిమా హాలు సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. అతనిని ప్రకాశం జిల్లా పేర్నమెట్ట మండలం పేర్ల మాణ్యం గ్రామానికి చెందిన షేక్ రసూల్ బాషా కుమారుడైన రాహుల్(23)గా పోలీసులు గుర్తించారు. కొల్లూరు- తెనాలి ప్రధాన రహదారిపై తెనాలి వైపునకు ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా ఫోన్ మాట్లాడుతూ ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ఢీ కొట్టాడు. దీంతో మెదడుకు తీవ్రంగా దెబ్బ తగిలి అక్కడిక్కడే మృతి చెందాడు. అతని జేబులో ఉన్న ఆధార్ కార్డు, మరో స్లిప్‌ను వేమూరు రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ రాజశేఖర్‌లు పరిశీలించారు. అతనిపై రేపల్లె ప్రాంతంలో 10 చోరీ కేసులు, తెలంగాణాలోని మేడ్చల్ ప్రాంతంలో 7కేసులు, గుంటూరు రూరల్ ప్రాంతంలో 1, తెనాలి ప్రాంతంలో 1కేసు నమోదై ఉన్నట్లు గుర్తించారు. ఆధార్ కార్డు ఆధారంగా సేకరించిన సమాచారాన్ని ప్రకాశం జిల్లా పోలీసులకు సమాచారం తెలిపారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తున్నట్లు తెలిపారు.

బయోలపై విజిలెన్స్ కన్నెర్ర

● రూ.6.10 లక్షల విలువైన నకిలీ మందులు పట్టివేత


బయో స్టిమ్యులెంట్స్ స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 8: గడచిన రెండు నెలల వ్యవధిలో జరిపిన దాడుల్లో అధిక మొత్తంలో నకిలీబయో మందులను స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు గురువారం మరో గుట్టురట్టు చేశారు. నగరంలోని ఏటుకూరు రోడ్డులో వున్న కమ్మ శేషయ్య గ్రౌండ్‌లో ఎలాంటి అనుమతి లేకుండా నిల్వవుంచిన బయో ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. అక్కడ గోడౌన్‌లో అక్రమంగా నిల్వవుంచిన 350 లీటర్ల బయోస్టిమ్యులెంట్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటికి జీ2 అనుమతులులేవని అధికారులు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాలకు తరలించటానికి సిద్ధంగా ఉన్న బయోస్టిమ్యులెంట్స్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న బయోల విలువ రూ.6.10 లక్షల వరకు ఉంటుందని విజిలెన్స్ అధికారులు ప్రకటించారు. గుంటూరు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కె.ఈశ్వరరావు నేతృత్వంలో జరిగిన ఈదాడుల్లో విజిలెన్స్ ఏవో కె.రమణకుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.రామచంద్రయ్య, స్థానిక ఏవో బి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.43 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

1,41,466 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,41,193 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,35,466 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 93,415 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	20000
నెంబరు. 5	10000	18000
273	9500	21500
341	9500	21500
4884	9000	19500
సూపర్ 10	12000	18000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	22000
బ్యాడిగి	9500	21500
దేవనూరు డీలక్స్	9000	20500
తెల్లకాయలు	5000	12000

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

బీసీలు బలపడకూడదన్నదే జగన్ దురాలోచన

● టీడీపీ పశ్చిమ నియోజకవర్గ బీసీ నేత డాక్టర్ నిమ్మల శేషయ్య



విలేకరులతో మాట్లాడు తున్న డాక్టర్ నిమ్మల

గుంటూరు,ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీలు బలపడకూడదన్నదే జగన్ దురాలోచన అని టీడీపీ పశ్చిమ నియోజకవర్గ బీసీ నేత డాక్టర్ నిమ్మల శేషయ్య అన్నారు. గురువారం పార్టీ జిల్లా కార్యాలయలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బడుగుబలహీన వర్గాలు బల పడకూడదు, బాగు పడకూడదన్నదే సీఎం జగన్ రెడ్డి దురాలోచన అని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఐదేళ్ల వైసీపీపాలనలో జగన్ ప్రతి అడుగు అందుకు సాక్ష్యమన్నారు. నా బీసీలు అంటూనే వారికి తీరని అన్యాయం చేశారని, అన్నిరంగాల్లో వెనక్కు నెట్టేశారని ఆవేదన వ్యక్తంచేశారు. జగన్‌కు బీసీలపై ప్రేమ ఉంటే గడిచిన ఐదేళ్లలో నియమించిన 700కు పైగా నామినేటెడ్ పదవుల్లో వారికి ఇచ్చిన పోస్టులు ఎన్నో చెప్పాలన్నారు. బీసీలపై జరిగినన్ని దాడులు, వారి ఆస్తుల కబ్జాలు ఎప్పుడూ జరగలేదన్నారు. నమ్మి ఓటేసిన పాపానికి నిండా ముంచిన జగన్ దారుణాలు చూశాక బీసీలందరు ఏకతాటి పైకి వచ్చి జయహో చంద్రబాబు అంటున్నారని నిమ్మల తెలిపారు.

జగన్ ధృతరాష్ట్ర కౌగిలిలో బందీలు కావొద్దు

● అధికారులకు జనసేన నేత బోనబోయిన సూచన



గుంటూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తం ఇసుక హోల్‌సేల్ దోపిడీ జరుగుతున్నదని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాసయాదవ్ ఆరోపించారు. ఈ క్రమంలో జగన్ ధృతరాష్ట్ర కౌగిలిలో అధికారులు బందీలు కావొద్దని హితవు పలికారు. బుధవారం కృష్ణనగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇసుక మీద గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసులు విచారణ జరుగుతుందని, ఈకేసులలో అధికారులు నలిగిపోవడం ఖాయమ న్నారు. ఇసుక దోపిడీకి పాల్పడుతున్న ఏ ఒక్కరిని వదిలిపెట్టే ప్రశ్నే లేదన్నారు. గతంలో ఏదైతే సొసైటీల ద్వారా ఇసుక విధానం ఉండేదో దానిని పునరుద్ధరించాలని బోనబోయిన ప్రభుత్వాన్ని డిమాం చేశారు.

విద్యార్థినులకు కళ్ళజోళ్ళ పంపిణీ

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 8: స్థానిక సాంబశివపేటలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం శంకరకంటి వైద్యాలయం ఆధ్వర్యంలో విద్యార్థినులకు ఉచిత కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కే.విజయలక్ష్మీ, డాక్టర్ సీహెచ్ రత్నమన్మోహన్, ఆస్పత్రి యూనిట్ హెడ్ ఎం.మాధవి, శంకర కంటి ఆస్పత్రి మేనేజర్ ఎల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కళాశాలలో మొత్తం 920 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, దృష్టిలోపంవున్న 101 మందికి ఉచితంగా కళ్ళజోళ్ళు పంపిణీ చేశారని ప్రిన్సిపాల్ సునీత వెల్లడించారు.

వైసీపీ విముక్త ఆంధ్రపదేశ్ లక్ష్యం కావాలి

● జనసేన గుంటూరు అర్బన్ అధ్యక్షుడు నేరెళ్ల పిలుపు

● 12వ డివిజన్‌లో 'జనంలోకి జనసేన'

గుంటూరు, ఫిబ్రవరి 8: వైసీపీ విముక్త ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని జనసేన అర్బన్ జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల సురేష్ కోరారు. గురువారం 12వ డివిజన్‌లోని లాలాపేటలో జరిగిన జనంలోకి జనసేన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా నేరెళ్ల సురేష్ మాట్లాడుతూ.. జగన్‌రెడ్డి తన అసమర్థ పాలనతో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని మండిపడ్డారు. జగన్ రెడ్డి పాలనలో ప్రజలు వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటన స్వేచ్ఛను పూర్తిగా కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు అధైర్యపడవద్దని, మరో అరవై రోజుల్లో ఏపీలో నియంత జగన్ రెడ్డి పాలన ముగిసి టీడీపీ, జనసేన కూటమి ఆధ్వర్యంలో ప్రజాపాలన ఏర్పడుతుందని నేరెళ్ల సురేష్ తెలిపారు. కార్యక్రమంలో జనసేన కార్పొరేటర్లు దాసరి లక్ష్మీదుర్గ, యర్రంశెట్టి పద్మావతి, నేతలు పాకనాటి రమాదేవి, బిట్రగుంట మల్లిక, ఆసియా తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రుణమాఫీ చేయాలి

● రైతు సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి8: అకాల వర్షాలు, కరువు కారణంగా రాష్ట్రంలో నష్టపోయిన ప్రతి రైతు, కౌలు రైతు కుటుంబానికి రూ2 లక్షల రూపాయల రుణమాఫీ చేయాలని, సాగు చేస్తున్న వారికి ఎకరానికి రూ 15 వేల పెట్టుబడి సాయం అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. రైతు, కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు, కౌలు రైతు సంఘాల జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణమాఫీతో పాటు తక్షణం ఇన్‌పుట్ సబ్సిడీ, భీమా పరిహారం చెల్లించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీలు మాట్లాడుతూ గుర్రపు డెక్కతో నిండి దుర్గంధంగావున్న గుంటూరు ఛానెల్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. నిరసనల్లో రైతు సంఘ నేతలు కంజుల విఠల్ రెడ్డి, యార్లగడ్డ వెంకటేశ్వర రావు, నాయకులు మేడా హనుమంతరావు, సత్యనారాయణ, జగన్నాథం, మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

●ప్రభుత్వ ఉద్యోగుల సంఘజిల్లా అధ్యక్షులు సయ్యద్ చాంద్ బాషా

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి8: జిల్లా వ్యాప్తంగా పలు ప్రభుత్వశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను తెలంగాణ మాదిరిగానే రెగ్యులర్ చేయాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షులు సయ్యద్ చాంద్ బాషా కోరారు. గురువారం మెడికల్ కళాశాల ఆవరణలో సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ క్రమబద్దీకరణ ప్రక్రియ ఉమ్మడి రాష్ట్రంలో భాగమైనప్పటికి తెలంగాణ రాష్ట్రంలో మొదటి ప్రాధాన్యతగా 1993 కు ముందు ఉద్యోగంలో చేరిన వారందరినీ రెగ్యులర్ చేసారని, మిగిలిన కాంట్రాక్టు ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించారని వివరించారు. అలాగే మన రాష్ట్రంలోనూ చేయాలన్నారు. హెచ్‌ఆర్‌ఏ తప్ప ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే మిగతా సదుపాయాలన్ని కాంట్రాక్టు ఉద్యోగులకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నేతలు కరీముల్లా షాఖాదరి, నాగేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

జీవనభృతి చెల్లింపుల్లో అధికారుల నిర్లక్ష్యం

గుంటూరు,ఫిబ్రవరి8: ఉద్యోగుల సస్పెన్షన్ కాలంలో జీవనభృతి చెల్లింపుల్లో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని రాష్ట్రపెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య గురువారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తంచేశారు. ప్రతి చిన్న కారణానికి ఉద్యోగులపై సస్పెన్షన్ వేటువేసి చేతులు దులుపుకుంటున్నారని, పర్యావసానంగా ఉద్యోగులకు సస్పెన్షన్ ఒక దీర్ఘకాలిక దుష్పరిణామంగా పరిణమించిందన్నారు. సస్పెన్షన్ చివరి తేదీ వరకు జీవనభృతి చెల్లించాల్సిందేనన్నారు. కొందరు అధికారులు ఈసమీక్ష జరగలే దన్న సాకుతో జీవనభృతి చెల్లించటం లేదన్నారు. ఉద్యోగి విచారణకు సహకరించటం లేదన్న మిషపై జీవనభృతిని తగ్గిస్తున్నారన్నారు. వాస్తవానికి విచారణను త్వరగా పూర్తిచేయాలన్న బాధ్యత విచారణ, క్రమశిక్షణ అధికారులపై ఉందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి రాజ్యాంగంలోని 311లో ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన రక్షణను పురస్కరించుకొని సస్పెన్షన్ కాలంలో ఉన్నతాధికారులు చెల్లించాల్సిన జీవనభృతిని సమయానుకూలంగా చెల్లించాలని వీరయ్య కోరారు.



రైల్వేస్టేషన్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ప్రజా సంఘాలు

ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలి

● ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ ఎదుట ధర్నా

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి8: మోదీ, జగన్ ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని ప్రజా సంఘాల నేతలు పిలుపునిచ్చారు. మజ్దూర్ అధికార్ సంఘర్ష అబియాన్ (మాసా) ఇచ్చిన దేశవ్యాప్త నిరసన పిలుపులో భాగంగా గురువారం భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో గురువారం రైల్వేస్టేషన్ ప్రధానద్వారం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఎస్వీ కృష్ణ, పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు యూ.గనిరాజులు మాట్లాడుతూ ప్రధాని మోదీ చాయ్ అమ్మినంత సులభంగా ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేస్తున్నారన్నారు. దేశంలో పేదరికం, నిరుద్యోగం విలయతాండవం చేస్తుంటే మోదీ మాత్రం రామనామ జపంచేస్తూ లౌకికదేశంపై హిందుత్వ కాషాయ రంగును పులుముతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగం మోదీ, జగన్ ప్రభుత్వాలకు ప్రజలు గుణపాఠం చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు టీ.నాగేశ్వరరావు, నేతలు సాయి, నల్లప్ప, ప్రకాష్, శ్రీను, శ్రీధర్ పాల్గొన్నారు.

బీసీల కోసం ప్రత్యేక రక్షణ చట్టం తెస్తాం

● టీడీపీ గుంటూరు పశ్చిమ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర



బీసీ నేతలతో కలసి జయహో బీసీ అంటున్న కోవెలమూడి రవీంద్ర

గుంటూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధికారంలోకి రాగానే బీసీల కోసం ప్రత్యేక రక్షణ చట్టం తీసుకువస్తున్నామని టీడీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర(నాని) తెలిపారు. అరండల్ పేటలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో గురువారం పశ్చిమ నియోజకవర్గ జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఆనాడే రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా బీసీలను ముందుకు తీసుకొచ్చి చదువుకున్న బీసీ యువకులను శాసనసభ్యులుగా, మంత్రులుగా చేసిన పార్టీ టీడీపీయేనన్నారు. నా ఎస్సీలు, నా బీసీలు, నా మైనార్టీలు అంటున్న జగన్ మోహన్‌రెడ్డి గతంలో టీడీపీ ప్రభుత్వం బీసీల కోసం తీసుకొచ్చిన కార్యక్రమాలు ఏమైనా కొనసాగిస్తున్నారా అని నిలదీశారు. గత ప్రభుత్వంలో ఆదరణ పథకం ద్వారా కులవృత్తులు చేసుకునే వారి కోసం తీసుకొచ్చిన పనిముట్లు ప్రస్తుతం గోడౌన్లలో నాలుగున్నరేళ్ళగా తుప్పు పడుతున్నాయని, అయినా వాటిని ఈనాటికీ బీసీలకు ఇవ్వలేదని విమర్శించారు. జగన్ రెడ్డి ప్రభుత్వం 75 మంది బీసీలను ఊచకోత కోసిందని, కానీ టీడీపీ బీసీల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకొస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సింహాద్రి కనకాచారి, ఉప్పుటూరి పేరయ్య, మల్లె ఈశ్వర్, వేములకొండ శ్రీనివాస్, చంద్రగిరి బాబు, అడక శ్రీనివాస్, నిమ్మల శేషయ్య, ఉప్పుతల సాంబ, రాళ్లబండి రామరాజు, గట్టి శ్రీను,గాలం వెంకటేశ్వర్లు, అప్పారావు యాదవ్, షాహిద్ బాబు,నన్నే,బత్తుల రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

బుగ్గన బడ్జెట్ అంతా అంకెల గారడీనే ...

అసెంబ్లీలో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్ర చదివిన బడ్జెట్ మొత్తం అంకెల గారడీనేని కోవెలమూడి రవీంద్ర(నాని) విమర్శించారు. పార్టీ జిల్లా కార్యలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లడుతూ.. బుగ్గన బడ్జెట్ అంచనాలు కొండంత, ఖర్చులు పిసరంత అని ఎద్దేవా చేసారు. రూ. 13వేల కోట్ల రెవెన్యూ లోటును రూ.44వేల కోట్లకు, రూ. 35వేల కోట్ల ద్రవ్యలోటును రూ. 60 వేల కోట్లకు పెంచిన ఘనత బుగ్గనదేనని అన్నారు. పన్నుల బాదుడు తప్ప బడ్జెట్లో కొత్త అంశాలేవీ లేవన్నారు. ప్రస్తుతం ఏపీ అప్పులు రూ.11.58లక్షల కోట్లకు చేరిందని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రాన్ని అప్పులాంధ్రప్రదేశ్‌గా మార్చింది జగన్ అండ్ కోనే అని ఆగ్రహం వ్యక్తం చేసారు. వైసీపీ హయాంలో తీసుకొచ్చిన ప్రతీ స్కీము ఒక స్కామ్‌గా మారిందని ఆరోపించారు. కార్యక్రమంలో పరిశీలకులు సింహాద్రి కనకాచారి, సుఖవాసి శ్రీనివాసరావు, ఈరంటి వరప్రసాద్, శ్రీరామ్ రాజీవ్ ఆనంద్, కసుకుర్తి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలచారి కాలనీకి అధికారుల పరుగులు

● యుద్ధ ప్రాతిపదికన వాటర్ శాంపిల్‌సేకరణ.

● ఆ ప్రాంతంలో పెద్ద ఎత్తున మెడికల్ క్యాంపులు.

● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించిన కార్పొరేషన్ అధికారులు

గుంటూరు (కార్పొరేషన్), ఫిబ్రవరి 8 : స్థానిక సంగడిగుంటలోని తిరుమలచారి కాలనీకి అధికారులు పరుగులు తీశారు. వాంతులు విరోచనాలతో ఆ ప్రాంతంలో ఒకరు మృతి చెందగా, ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అస్వస్థకు గురై గుంటూరు జీజీహెచ్, ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతోపాటు ఆ ప్రాంతంలో మరో 10 కుటుంబాలవారు అనారోగ్యానికి గురయ్యారు. దీంతో ఆంధ్రజ్యోతి దినపత్రిక 'డయేరియా.. ఒకరి మృతి?' అను శీర్షికన ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. కమిషనర్ కీర్తిచేకూరి గురువారం ఇన్‌చార్జి ఎస్‌ఈ సుందరామిరెడ్డిని, సీఎంహెచ్‌వో లను తక్షణమే ఆ ప్రాంతానికివెళ్లి పరిశీలచేయాలని ఆదేశించారు. దీంతో హడావిడిగా అధికారులు పరుగులు తీశారు. మృతిచెందిన కొర్రపాటి ఓబులు హృద్రోగి అయినందున గుండెపోటుతో మరణించినట్లు జీజీహెచ్ వైద్యులు ధ్రువీకరించారని అధికారులు తెలిపారు. ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులను సంబంధిత ప్రాంతానికి వెళ్లి తాగునీటి సరఫరా స్యాంపిల్స్ తీయాలని, అవసరమైతే మెడికల్ క్యాంప్ లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తాగునీటి కలుషితంపై నివేదికలు అందించాలన్నారు. మృతుడి కుటుంబాన్ని, చుట్టుపక్కల గృహవాసులను సంప్రదించి, అనారోగ్య సంఘటనలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఐపీడీ కాలని వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో 10 మంది ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలతో సదరు ప్రాంతంలో డోర్ టు డోర్ మెడికల్ సర్వే నిర్వహించామని, కేవలం ఆ కాలనీలో ఓబులు కుటుంబంలో తప్ప మిగిలిన కుటుంబాల్లో ఎవ్వరికీ అనారోగ్య సమస్యలు లేవని నగరపాలక సంస్థ సీఎంవోహెచ్ తెలిపారు. నగరపాలక సంస్థ ఎస్.ఈ.(ఎఫ్ఏసీ), మెడికల్ ల్యాబ్ ఫీల్డ్ ఆఫీసర్ శివకుమార్ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో నీటి స్యాంపిల్స్ సేకరించి, పరీక్షించగా ప్రాథమికంగా త్రాగునీటిలో క్లోరిన్ తగుపాళ్లలో ఉందని, నీరు కలుషితం కాలేదని ధ్రువీకరించారు. కెమికల్, మైక్రో బయోలాజికల్ పరీక్షల నిమ్మిత్తం నమూనాలు సేకరించామన్నారు. వీలైనంత త్వరలో నివేదిక ఇస్తామని తెలిపారు. ఎస్.ఈ. మాట్లాడుతూ బీఆర్‌స్టేడియం సమీపంలో ఇటీవల చేపట్టిన పైప్ లైన్ మరమతులకు కలుషిత నీటికి సంబంధం లేదని తెలిపారు.

కలుషిత నీటి సరఫరాపై నేడు టీడీపీ ఆందోళన...

నగరంలో తిరుమలచారికాలనీలో కలుషిత నీరు తాగి ఒకరు మృతి చెందగా మరికొందరు అస్వస్థకు గురయ్యారు. దీనిపై శుక్రవారం టీడీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. బాధిత కుటుంబాలను పరామర్శించి, వారికి నష్టపరిహారం అందించే వరకు పోరాడుతామని నసీర్ తెలిపారు.



వృద్ధాశ్రమంలో కుర్చీలను అందజేసిన బ్యాంక్ ఆఫ్ బరోడా సిబ్బంది

బ్యాంక్ ఆఫ్ బరోడా ఆధ్వర్యంలో

వృద్ధాశ్రమానికి కుర్చీలు, దుప్పట్లు అందజేత

గుంటూరు, ఫిబ్రవరి 8: బ్యాంక్ ఆఫ్ బరోడా నగరంపాలెం బ్రాంచ్ ఆధ్వర్యంలో కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా పాత గుంటూరులోని ఆర్ఆర్ మూర్తి వృద్ధాశ్రమానికి గురువారం 50 కుర్చీలు, 75 దుప్పట్లుతోపాటు, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ నరేష్ పంగ మాట్లాడుతూ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో బ్యాంక్ఆఫ్‌బరోడా మరింత ముందుంటుందని, ఎల్లప్పుడూ తన ఉనికిని చాటుకుంటుందన్నారు. ప్రజలు బ్యాంక్ ఆఫ్ బరోడా సేవలను వినియోగించుకోవాలని కోరారు.



విద్యార్థులతో చైర్మన్ అన్నా నందకిషోర్

సీఏ ఫౌండేషన్ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 8: ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) బుధవారం ప్రకటించిన సీఏ ఫౌండేషన్ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థులు జాతీయస్థాయిలో అత్యధిక మార్కులు సాధించారని చైర్మన్ అన్నా నందకిషోర్ తెలిపారు. కే.సాయి గణేష్ 400 మార్కులకుగాను 311, దావి నహర్ 299, కే.యోగితరెడ్డి 285, యూ.సాయివికాస్ 279, నిర్భయ్‌జైన్ 268, కే.కీర్తిక 267, ఆలీవ్‌గ్లోరియా 261మార్కులు సాధించారని తెలిపారు. ఈసందర్భంగా ప్రతిభకనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులను చైర్మన్ అన్నా నంద కిషోర్, డైరెక్టర్ శ్రీలక్ష్మీ తదితరులు అభినందించారు.

క్రీడల్లో జిల్లాను అగ్రభాగాన నిలపాలి : జేసీ

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి8: క్రీడలలో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని జేసీ రాజకుమారి ఆకాంక్షించారు. 'ఆడుదాం ఆంధ్ర' జిల్లా స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచి క్రీడాకారులు శుక్రవారం నుంచి విశాఖలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనున్నారు. ఈమేరకు గురువారం క్రీడాకారుల బస్సు స్థానిక ఎన్టీఆర్ స్టేడియం వద్ద నుంచి బయలుదేరగా జేసీ రాజకుమారి క్రీడాకారులను కలసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జెండా ఊపి బస్సును ప్రారంభించారు. చీఫ్ కోచ్ డీ.వెంకటేశ్వర్లు మట్లాడుతూ.. జిల్లాస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన 114 మంది రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుంటూరు, ఫిబ్రవరి 8: రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా బ్రాడీపేట 4వ లైనులో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీ-8 సెక్షన్ ఏఈ చిట్టిబాబు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవు

● రేషన్ సరఫరా వాహనాలను తనిఖీ చేసిన జేసీ

గుంటూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): రేషన్ సరఫరాలో ఏవైనా అవకతవకలు, అక్రమాలు చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ జీ. రాజకుమారి హెచ్చరించారు. రేషన్ సరఫరా తీరుపై జేసీ రాజకుమారి గురువారం తనిఖీలు నిర్వహించారు. గుంటూరులోని చంద్రమౌళి నగర్లో ఆమె రేషన్ సరుకులు పంపిణీ చేసే మొబైల్ డిస్పెన్సరీ యూనిట్లను పరిశీలించారు. లబ్ధిదారులకు పంపిణీచేస్తున్న సరుకులను పరీక్షించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక లబ్దిదారులతో రేషన్ సరఫరాపై మాట్లాడుతూ సకాలంలో రేషన్‌సరఫరా అవుతోందా, లేదా? వాహనదారులు, డీలర్ల పనితీరు ఎలా వుంది? అంటూ లబ్దిదారులను అడిగి తెలుసుకున్నారు. రేషన్ సరఫరాపై లబ్దిదారులు సంతృప్తి వ్యక్తం చేశారని జేసీ రాజకుమారి గణియా తెలిపారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై సదస్సు

గుంటూరు, ఫిబ్రవరి 8: స్థానిక సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో 'అధికారిక గణాంకాల వ్యవస్థ-ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో ఉద్యోగ ఉపాధి అవకాశాలు' అంశంపై గోష్ఠి, తదనంతరం క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉప ప్రాంతీయ కార్యాలయ గణాంక అధికారి గీ. హనుమంతరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని పలు డిగ్రీ కళాశాలల విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొననున్నట్లు తెలిపారు.

విగ్రహాల ఏర్పాటు వివాదాస్పదం

● వైఎస్, అంబేద్కర్ విగ్రహాల ఏర్పాటుకు ఇటీవలే శంకుస్థాపన

● ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటు యోచనలో టీడీపీ నేతలు

● జగ్జీవన్‌రామ్ విగ్రహ ఏర్పాటుకు మరో వర్గం ప్రయత్నం

● అనుమతి లేకుండా ఏ విగ్రహం ఏర్పాటు చేయరాదని పోలీసుల హెచ్చరిక



కొరిటెపాడు సెంటరు వద్ద సమీకృతమైన టీడీపీ, వైసీపీ శ్రేణులు

గుంటూరు, ఫిబ్రవరి 8 : స్థానిక కొరిటెపాడు సెంటర్‌లో విగ్రహాల ఏర్పాటు వివాదాస్పదంగా మారింది. కొరిటపాడు, సూర్యహోటల్ సెంటర్ వద్ద ఎలాంటి అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన వైఎస్ఆర్, అంబేద్కర్ విగ్రహాల ఏర్పాటుకు అవసరమైన దిమ్మెల నిర్మాణానికి ఇటీవలే మంత్రి విడదల రజిని వాటికి శంకుస్థాపన చేశారు. ఈ నేపథ్యంలో సూర్యహోటల్ ఎదురు సెంటర్లోని డివైడర్‌పై ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు టీడీపీ నేత కొమ్మినేని కోటేశ్వరరావు ఏర్పాట్లు చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ హేమలత భర్త వలివీరారెడ్డి అక్కడకు చేరుకొని అభ్యంతరం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న టీడీపీ నేతలు కనపర్తి శ్రీనివాసరావు, కార్పొరేటర్ వేములపల్లి శ్రీరాం ప్రసాద్, నరేష్, పాకాల పాటి శ్రీకాంత్, ఈశ్వర్, పెద్ద సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు ఘటన స్థలానికి వచ్చారు. దీంతో వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ఇక్కడ ఎన్టీఆర్ విగ్రహం ఎలా ఏర్పాటుచేస్తారో చూస్తానంటూ వలివీరారెడ్డి అనడంతో టీడీపీ నేతలు ప్రతిగా వైయస్ విగ్రహం ఎలా పెడతారో చూస్తామంటూ సవాల్ చేశారు. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత పరిస్థితి తలెత్తింది. ఈ క్రమంలో వలివీరారెడ్డి అరండల్ పేట సీఐ వెంకటేశ్వర రెడ్డికి సమాచారం ఇచ్చారు. దీంతో వెస్ట్ డీఎస్పీ ఉమామహేశ్వర్ రెడ్డి, అరండల్ పేట సీఐ వెంకటేశ్వర్ రెడ్డి, పట్టాభిపురం సీఐ విజయ్ చంద్ర సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపు చేశారు. అక్కడ ఏర్పాటుచేయబోయే ఎన్టీఆర్ విగ్రహానికి అనుమతి ఉందంటూ వలివీరారెడ్డి పోలీసులకు చెప్పారు. కేవలం ఎన్టీఆర్ విగ్రహాన్ని అడ్డుకోవడం కోసమే వలివీరారెడ్డి రెచ్చగొట్టి ఓవర్గాన్ని ఇక్కడకు రప్పించారని టీడీపీ నాయకులు ఆరోపించారు. దీంతో పోలీసు అధికారులు ఇక్కడ ఎలాంటి అనుమతి లేకుండా ఏ విగ్రహం ఏర్పాటు చేయరాదని స్పష్టం చేసి ఇరువర్గాలను అక్కడి నుంచి పంపించారు. అక్కడ ఎటువంటి విగ్రహాలు ఏర్పాటు చేయకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

అనంతరం టీడీపీ నేతలు విలేకరులతో మాట్లాడుతూ.. అనుమతి లేకుండా ఎవరి విగ్రహాలు ఏర్పాటు చేయరాదని, అలాగని వైఎస్ విగ్రహం ఏర్పాటు చేస్తే తాము కూడా ఎన్టీఆర్ గృహం ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. రాత్రికి రాత్రి ఏ విగ్రహం ఏర్పాటు చేసినా తలెత్తే శాంతిభద్రతల సమస్యకు పోలీసులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. దీని దృష్టిలో ఉంచుకుని ఎటువంటి విగ్రహం ఏర్పాటు చేయకుండా తగు చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు పోలీసులను డిమాండ్ చేశారు.

ఉద్యోగుల వివరాలు అప్లోడ్ చేయాలి

● కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి

గుంటూరుసిటీ, ఫిబ్రవరి 8: రానున్న సార్వత్రిక ఎన్నికలలో విధులు నిర్వహించేందుకు అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను ఎన్నికల సంఘం నిర్దేశించిన పోర్టల్‌లో నిర్ణీతగడువులోపు అప్లోడ్ చేయటానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్‌శంకరన్ సమావేశ హాల్లో పోలింగ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ పోర్టల్‌లో ఉద్యోగుల వివరాల నమోదుపై అవగాహన కోసం జిల్లా అధికారులకు (డీడీవో) నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధులు కేటాయింపు కోసం జిల్లాలోని అన్ని శాఖల ఉద్యోగుల వివరాలను పోలింగ్ పర్సన్స్ మేనేజ్మెంట్ సిస్టమ్ పోర్టల్‌లో తప్పనసరిగా నమోదు చేయాలన్నారు. దీని కోసం కలెక్టరేట్‌లోని ఎన్నికల విభాగంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఉద్యోగుల వివరాల నమోదును ఫిబ్రవరి 10 సాయంత్రం లోపు ఖచ్చితంగా పూర్తి చేయాలన్నారు. వివరాల నమోదు చేసే విధానాన్ని జిల్లా ఇన్ఫర్మేటిక్ అధికారి బిమల్‌కుమార్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా డీడీవోలకి వివరించారు. కార్యక్రమంలో డీఆర్వో పెద్ది రోజా, డీఈవో శైలజ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దాల్‌మిల్ క్లస్టర్ ఏర్పాటుకు భూములు సేకరిస్తాం

● జాయింట్ కలెక్టర్ రాజకుమారి గణియా

గుంటూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తెనాలి ప్రాంతంలో దాల్ మిల్ క్లస్టర్ ఎర్పాటుకు అవసరమైన భూములను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని సంయుక్త కలెక్టర్ జీ.రాజకుమారి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కే.ఎస్ జవహర్ రెడ్డికి నివేదించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి చీఫ్ సెక్రెటరీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ దాల్‌మిల్లు క్లస్టర్‌కు తెనాలి మార్కెట్ యార్డులో స్థలాల సేకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయగా, త్వరలో పరిశ్రమల శాఖకు స్థలాలు అందిస్తామని చెప్పారు. అంతకు ముందు రెవెన్యూకి సంబంధించి మూడవ విడత రీసర్వే, ఇనామ్, అసెన్డ్ భూములు నిషేదిత జాబితా నుంచి తొలగింపు, పేదలందరికీ ఇళ్ళ పథకం స్థలాల రిజిస్ట్రేషన్, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఎర్పాటుకు భూముల సేకరణ, ఇళ్ళ నిర్మాణాల పురోగతి తదితర అంశాలపై సీఎస్ సమీక్షించి సూచనలు అందించారు. సమావేశంలో డీఆర్వో పెద్ది రోజా, ఎస్.ఈ ఆర్‌డబ్ల్యూ ఎస్ సురేష్, సీపీవోశేషశ్రీ, డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మీ, హౌసింగ్ పీడీ వేణుగోపాల్ అధికారులు పలువురు పాల్గొన్నారు.

పేదలు నివసించే ఇళ్లకు పట్టాలివ్వాలి

● జేసీ రాజకుమారికి ఎమ్మెల్సీ కేఎస్. లక్ష్మణరావు వినతి

గుంటూరు(తూర్పు),ఫిబ్రవరి8: ప్రభుత్వ నియామాల ప్రకారం అభ్యంతరాలు లేని ప్రభుత్వ భూముల్లో ఇళ్ళు ఏర్పాటు చేసుకుని నివాసముంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని ఎమ్మెల్సీ కే.ఎస్ లక్ష్మణరావు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం కలెక్టరేట్‌లో జేసీ కార్యాలయంలో సీపీఎం నేతలతో కలిసి ఎమ్మెల్సీ లక్ష్మణరావు జేసీ రాజకుమారికి వినతిపత్రం అందజేశారు. అనంతరం లక్ష్మణరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావులు మాట్లాడుతూ తాడేపల్లి, గుంటూరురూరల్ మండలం పరిధిలో తదితర ప్రాంతాలలో పేదలు వివిధ రకాల ప్రభుత్వ భూముల్లో ఇళ్లు ఏర్పాటు చేసుకుని నివాసాముంటున్నారని, ఆయా ఇళ్లకు పట్టాలివ్వాలని కోరారు. అలాగే కొండపోరంబోకు స్థలాల్లో నివాసముంటున్న వారికి ఆయా భూమిని రెవెన్యూ పోరంబోకుగా మార్చి పట్టాలివ్వాలని, జీవో నెం.388 ప్రకారం ఇళ్ళను రెగ్యులరైజ్ చేయాలన్నారు. జేసీ రాజకుమారి స్పందిస్తూ సమస్యలను పరిష్కరిస్తామని హామీఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎంనేతలు బీ.కొటేశ్వరి, ఎం.ఫకీరయ్య, ఎన్.శివాజి, దుర్గారావు, వెంకటేశ్వరరావు, ఆదినికల్సన్ ఉన్నారు.

క్లెయిమ్‌లను జాగ్రత్తగా పరిశీలించాలి

● గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఈఆర్వో రాజ్యలక్ష్మి

గుంటూరు(కార్పొరేషన్), ఆగస్టు 8: ఓటర్ల డ్రాఫ్ట్ రోల్ అనంతరం అందిన క్లెయిమ్‌లను బీఎల్వోలు అత్యంత జాగ్రత్తగా పరిశీలన చేసి రిపోర్ట్ ఇవ్వాలని నగరపాలకసంస్థ అదనపు కమిషనర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఈఆర్వో కే. రాజ్యలక్ష్మీ స్పష్టం చేశారు. నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు గురువారం స్థానిక శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో తూర్పు నియోజకవర్గ బీఎల్‌వోలు, సూపర్‌వైజరీ అధికారులతో ఎన్నికల ఓటర్ల తుది జాబితాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నూతన ఓట్లచేర్పులు, తొలగింపు దరఖాస్తులు సూపర్‌వైజరీ అధికారులు, ఏఈఆర్వోలు నేరుగా పరిశీలించాలన్నారు. తూర్పు నియోజకవర్గంలో 250 పోలింగ్ కేంద్రాలకు గాను 250 మంది బీఎల్వోలు, 19 మంది సూపర్‌వైజరీ అధికారులు ఉన్నారన్నారు. బీఎల్వోలు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను పరిశీలించి అవసరమైన వాటి కోసం ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వాలని, సూపర్‌వైజరీ అధికారులు పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులపై బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఏఈఆర్వోలు డీ.వెంకటలక్ష్మి, ప్రదీప్‌కుమార్, సూపరింటెండెంట్లు సాంబశివరావు, పద్మ, డిప్యూటీ తహసీల్దార్లు బీ.భాస్కర్, మల్లేశ్వరరావు, సూపర్‌వైజరీ అధికారులు, బీఎల్వోలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి8: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో గురువారం మాసశివరాత్రి సందర్భంగా గణపతి, చండీ హోమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బొల్లేపల్లి సత్యనారాయణ లలితాంబ దంపతులచే 9 మంది వేద పండితుల నిర్వహణలో గణపతికి, శివలింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు, లక్ష్మీ గణపతి, చండీ, రుద్ర హోమాలు నిర్వహించి పూర్ణాహుతి చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సిహెచ్. మస్తానయ్య, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

గుంటూరు, ఫిబ్రవరి 8 : స్థానిక రెడ్డిపాలెం, నంబూరు స్టేషన్ల మధ్యలో రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. గుర్తుపట్టడానికి వీల్లేకుండా ఉంది. మృతుడి వయస్సు సుమారు 45 సంవత్సరాలు ఉంటుందని, తెల్ల గళ్ళ చొక్కా చాక్లెట్ రంగు జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించామని, మృతునికి సంబంధించిన వారు గుంటూరు రైల్వే పోలీసులను 9440627546లో గానీ,7207076614లో గానీ సంప్రదించాలని కోరారు

బహిరంగ ప్రకటన

మా క్లయింట్, గుంటూరు సిటీ, 2/4 బ్రాడీపేట, డోర్.నెం.5-21-8 కాపురస్తురాలైన **కాకుమాను వెంకట శివప్రసాద్ గారి భార్య కాకుమాను రాధిక గారి** వలన సంజాయిషీ పొంది తెలియజేయునదేమనగా. ది.07-02- 2024వ తేదీన, మా క్లయింట్ గుంటూరు సిటీ, కొరిటిపాడు లైబ్రరీ సెంటర్ నుండి ఆటోలో శంకర్ విలాస్ సెంటర్ వద్దకు వస్తూ, తన పేరున గల స్థిరాస్తికి సంబంధించిన అనగా గుంటూరుజిల్లా, పెదకాకాని మండలం, వెనిగండ్ల గ్రామ డి.నెం. 365/A2 లో గల య.2.00 సెంట్లు భూమిలోని వి.జి.టి పుడా, విజయవాడ వారి లే-అవుట్ ప్లాను దాఖల ప్లాట్ నెం. 882కు సంబంధించిన ఒరిజినల్ విక్రయ దస్తావేజు అనగా **డాక్యుమెంట్ నెం. 2852/1997, తేది : 06-12-1997**తో పెదకాకాని సబ్-రిజిస్ట్రార్ ఆఫీసులో రిజిస్టర్ కాబడినటువంటి దస్తావేజు మరియు దానికి సంబంధించిన లింకు డాక్యుమెంటును కలిగిన కవరును, పొరపాటున ఆటోలో మరచిపోయినారు. సదరు పైన ఉదహరించిన మా క్లయింట్ పేరుతో గల ఒరిజినల్ విక్రయ దస్తావేజు మరియు లింకు డాక్యుమెంట్లు ఉన్న కవరు, ఎవరికైనను దొరికినయెడల మాకుగాని, మా క్లయింటుకుగాని అందజేసినయెడల తగిన పారితోషికము ఇవ్వబడును.

గుంటూరు : 08-02-2024

కటకంశెట్టి శ్రీనివాసరావు, అడ్వకేట్
GF-3, రత్నా టవర్స్, 18/1, అరండల్‌పేట, గుంటూరు-2.
మొబైల్ నెం. 9440632721

GENERAL NOTICE

IN THE COURT OF THE I ADDL. SENIOR CIVIL JUDGE: GUNTUR

I.P No: 57 /2023

BETWEEN :
Yenumula Rama Devi, W/o. Prabhakar, R/o. Door No. 6-7-52, 7/2 Arundelpet, Guntur. ...Petitioner

and

1. Chennam Tirupatamma@Peddammai, W/o. Not Known, R/o. Srinagar 1st Lane, Guntur, 2)Vempa Chandra Sekhar, S/o. Not known, R/o. Lam, Tadikonda(Md), Guntur Dt. 3) Vemula Subba Rao, S/o. Not known, R/o. Gorantla Guntur, 4) Kunta Nageswara Rao @ Babu, S/o. Not Known, R/o. Yadava Bazar, Old Guntur, Guntur, 5) R. Yaswanth, S/o. Sangameswara Rao, R/o. Bestaveedhi, Kothapet, Guntur, 6) Shaik Shareef, S/o. Nasarvali, R/o. Besta Veedhi, Kothapet, Guntur, 7) Shaik Jani, S/o. Moulali, R/o. Sanakkayala Factory, Kothapet, Guntur,8)The official receiver, District court compound, Guntur.

పై నెంబరు IP లోని పిటీషనర్ తనను ఇన్‌సాల్వెంటుగా డిక్లేర్‌చేయమని కోరుచు పిటీషన్ దాఖలుచేయగా సదరు పిటీషన్ పై ఎవరికైన అభ్యంతరములు ఉంటే తెలుపుకోనవలసినదిగా శ్రీ కోర్టు వారు జనరల్ నోటీసు నిమిత్తం **దీ:20-02-2024కి** వాయిదావేసినారు. కావున ఆ రోజున **ఉ.గం॥10:30ని॥లకు** పైకోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీతరపు వకీలు గారి ద్వారా గాని హాజరై మీకు గల అక్షేపణలు తెలుపుకోనగలరు. లేనిచో శ్రీ కోర్టు వారిచే మీ పరోక్షమున తీర్మానించబడును. (శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు).

వాయిదా తేది: 20-02-2024.

నల్లక వెంకట వేణు
పిటీషనర్ తరపు అడ్వకేట్, గుంటూరు. సెల్: 9949140978

దిక్సూచి
DIKSUCHI

టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్‌లో
బీబీఏ, ఎంబీఏ



గ్వాలియర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్(ఐఐటీటీఎం)- బీబీఏ(టూరిజం అండ్ ట్రావెల్), ఎంబీఏ(టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ సహకారంతో ఈ ప్రోగ్రామ్‌లను నిర్వహిస్తున్నారు. వీటిని స్పెసిఫిక్ అండ్ జనరిక్ బిజినెస్ మాడ్యూల్స్, ఇండస్ట్రీ ప్రాక్టీసెస్, అకడమిక్ డెవలప్‌మెంట్స్, టూరిజం అండ్ బిజినెస్ స్టడీస్ తదితర అంశాలతో రూపొందించారు. ప్రోగ్రామ్‌లో భాగంగా సమ్మర్ ఇంటర్న్‌షిప్‌లు, స్టడీ టూర్లు ఉంటాయి. నెల్లూరు సహా గ్వాలియర్, భువనేశ్వర్, నోయిడా, గోవా క్యాంపస్‌లు అందుబాటులో ఉన్నా యి. గోవాలో ఎంబీఏ ప్రోగ్రామ్ మాత్రమే ఉంది. ఐఐటీటీఎం నిర్వహించే అడ్మిషన్ టెస్ట్(ఐఏటీ) లేదా నిర్దేశిత జాతీయ పరీక్ష స్కోర్, గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

బీబీఏ(టూరిజం అండ్ ట్రావెల్): ఈ ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. మొత్తం 375 సీట్లు ఉన్నాయి. నెల్లూరు క్యాంపస్‌లో 75, గ్వాలియర్ క్యాంపస్‌లో 112, భువనేశ్వర్ క్యాంపస్‌లో 75, నోయిడా క్యాంపస్‌లో 113 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి. సీయూఈటీ 2023 స్కోర్ ఉన్నవారు ఐఏటీ 2024 రాయనవసరం లేదు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదేని గ్రూప్‌తో ఇంటర్/10+2/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

ఎంబీఏ(టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్): ఇది రెండేళ్ల వ్యవధిగల ఫుల్ టైం మాస్టర్స్ డిగ్రీ ప్రోగ్రామ్. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ప్రస్తుత పరిస్థితుల్లో టూరిజం, ట్రావెల్ మేనేజ్‌మెంట్‌కు అవసరమైన అంశాలను దృష్టిలో ఉంచుకొని ఈ కోర్సుని రూపొందించారు. ఎకనామిక్స్, మేనేజ్‌మెంట్ వంటి కోర్ సబ్జెక్టులతో పాటు స్పెషలైజేషన్ సబ్జెక్టులు చదవాల్సి ఉంటుంది. అభ్యర్థులు వారి ఆసక్తి మేరకు టూర్ గైడింగ్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, అడ్వెంచర్ టూరిజం, సప్లయ్ చెయిన్ అండ్ లాజిస్టిక్స్ స్పెషలైజేషన్‌లు ఎంచుకోవచ్చు. చివరి సెమిస్టర్లో ఆన్ జాబ్ ట్రెయినింగ్ ఉంటుంది.

సీట్లు: మొత్తం 750 సీట్లు ఉన్నాయి. నెల్లూరు క్యాంపస్‌లో 75, గ్వాలియర్ క్యాంపస్‌లో 334, భువనేశ్వర్ క్యాంపస్‌లో 112, నోయిడా క్యాంపస్‌లో 189, గోవా క్యాంపస్‌లో 40 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ద్వితీయశ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసే అభ్యర్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2024 సెప్టెంబరు 30 నాటికి సర్టిఫికెట్‌లు, మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. మ్యాట్/క్యాట్/సీమ్యాట్/ఎక్స్‌ఏటీ/జీమ్యాట్/ఏటీఎంఏ/సీయూఈటీ వంటి జాతీయ పరీక్షల్లో ఒకటి రాసి అర్హత పొందిన అభ్యర్థులు సంస్థ నిర్వహించే అడ్మిషన్ టెస్ట్ రాయనవసరం లేదు. స్కోర్ కార్డ్ వ్యాలిడిటీ 2023 జూన్ 1 నుంచి 2024 మే 31 మధ్య ఉండాలి.

ఐఏటీ 2024 వివరాలు: ఈ టెస్ట్‌ని ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం వంద మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. జనరల్ అవేర్‌నెస్ నుంచి 50, వెర్బల్ ఎబిలిటీ నుంచి 25, క్వాంటిటేటివ్ ఎబిలిటీ నుంచి 25 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 100. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం రెండు గంటలు.

- ఈ పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలకు పిలుస్తారు. అడ్మిషన్ టెస్ట్/జాతీయ పరీక్ష స్కోర్‌కు 70 శాతం, గ్రూప్ డిస్కషన్‌కు 15 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూకి 15 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు. తరవాత డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 5
- **ఐఏటీ 2024 తేదీ:** జూన్ 9
- **అకడమిక్ సెషన్స్ ప్రారంభం:** జూలై 15 నుంచి
- **వెబ్‌సైట్:** www.iittm.ac.in

జాబ్ కార్నర్

ఐడీబీఐ బ్యాంక్‌లో జూనియర్ అసిస్టెంట్ మేనేజర్లు

మొత్తం ఖాళీలు 500

దేశవ్యాప్తంగా వివిధ జోన్లలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ఐడీబీఐ బ్యాంక్ అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. మణిపాల్(బెంగళూరు), నిట్టే(గ్రేటర్ నోయిడా) విద్యా సంస్థలతో కలిసి పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్(పీజీడీబీఎఫ్) కోర్సు ద్వారా ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఐడీబీఐ) ఆ పోస్టులను భర్తీ చేయనుంది.

అర్హత: ఏదైనా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ ఉత్తీర్ణత సాధించాలి. వయసు 2024 జనవరి 31 నాటికి 21 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల గరిష్ఠ వయోపరిమితి నిబంధనలో సడలింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: అర్హులైన అభ్యర్థులకు ఆన్‌లైన్ టెస్ట్ నిర్వహిస్తారు. ప్రతిభ కనబర్చిన వారు పర్సనల్ ఇంటర్వ్యూలకు అర్హత సాధిస్తారు. అందులో ప్రతిభ, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా తుది ఎంపికలు చేపడతారు.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం: ఫిబ్రవరి 12
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 26
ఆన్‌లైన్ పరీక్ష తేదీ: మార్చి 17
వెబ్‌సైట్: www.idbibank.in/

ఏపీ ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోని పాఠశాల విద్యాశాఖ 'ఉపాధ్యాయ అర్హత పరీక్ష'(ఏపీ టెట్-2024) నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనికి ఉపాధ్యాయ నియామక పరీక్షలో 20 శాతం వెయిటేజీ కూడా ఉంటుంది. అభ్యర్థులు 1 నుంచి 5 తరగతుల బోధనకు పేపర్-1(ఎ, బి); 6 నుంచి 8 తరగతుల బోధనకు పేపర్-2(ఎ, బి)లో అర్హత సాధించాల్సి ఉంటుంది.

అర్హతలు: పేపర్‌ను బట్టి ఇంటర్మీడియట్, బ్యాచిలర్స్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీతో పాటు డీఈడీ/బీఈడీ/లాంగ్వేజ్ పండిట్ ఉత్తీర్ణులై ఉండాలి. 2023-24 విద్యా సంవత్సరం చివరి ఏడాది చదివే అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్ష విధానం: ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) నిర్వహిస్తారు. రోజుకు రెండు సెషన్లలో పరీక్ష ఉంటుంది. మొదటి సెషన్ ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు ఉంటుంది.

పరీక్ష రుసుము: రూ.750
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 18
పరీక్షల నిర్వహణ: ఫిబ్రవరి 27 నుంచి మార్చి 9
వెబ్‌సైట్: aptet.apcfss.in/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/AeojJL0లో చదవండి.

'ఈగల్' చిత్రంలో మునుపెన్నడూ చూడని రవితేజను ప్రేక్షకులు చూడబోతున్నారు. ఈ చిత్రం కాన్సెప్ట్‌లోనే విధ్వంసం ఉంది. కంటెంట్ ఎక్స్‌ట్రార్డినరీగా ఉంటుంది' అని దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని చెప్పారు. రవితేజ కథానాయకుడిగా ఆయన దర్శకత్వం వహించిన చిత్రం 'ఈగల్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. కావ్య థాపర్, అనుపమా పరమేశ్వరన్ కథానాయికలు. 'ఈగల్' చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా సినిమా విశేషాలను కార్తీక్ మీడియాతో పంచుకున్నారు.

రాంబో, టెర్మినేటర్ తరహాలో...

కార్తీక్ ఘట్టమనేని



- 'ఈగల్'లో కథానాయకుడు సాధారణ పత్తి రైతులా కనిపిస్తాడు. కానీ ఓ అంతర్జాతీయ సమస్యపైన అతను పోరాటం చేస్తుంటాడు. 'రాంబో', టెర్మినేటర్' లాంటి సినిమాలను ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేశారు. మనం కూడా అలాంటి ఒక సినిమా తీయాలనే ప్రయత్నంలోంచే 'ఈగల్' పుట్టింది. ఇదొక అద్భుతమైన యాక్షన్, డ్రామా ఎంటర్టైనర్. ప్రేక్షకులను అలరిస్తుంది. పూర్తి స్థాయి యాక్షన్ చిత్రం చేయాలనేది దర్శకుడిగా నా కల. అది 'ఈగల్'తో నెరవేరింది.
- పక్షుల్లో గద్దకు చాలా సునిశితమైన దృష్టి ఉంటుంది. సుదూరాన ఉన్న లక్ష్యాన్ని సైతం చూసి వేటాడుతుంది. ఈ సినిమాలో కథానాయకుడికి కూడా భవిష్యత్తులో జరగబోయే పరిణామాలను అంచనా వేయగల నైపుణ్యం ఉంటుంది. అందుకే 'ఈగల్' టైటిల్ పెట్టాం. హిందీలో 'సహదేవ్ వర్మ' టైటిల్‌తో విడుదల చేస్తున్నాం.
- 'ధమాకా' సినిమాకు సినిమాటోగ్రాఫర్‌గా పనిచేసే సమయంలో రవితేజకు కథ చెప్పాను. 'మంచి ఎంటర్టైనర్ అవుతుంది చేద్దాం' అని వెన్నుతట్టారు. ఈ సినిమా అంతటా ఆయన పాత్ర ఒకేలా ఉంటుంది. ఆయన ఎనర్జీ లెవల్స్ వేరే లెవల్లో ఉంటాయి. ఆయన నుంచి నేర్చుకోవాల్సింది క్రమశిక్షణ. ఆహారపు అలవాట్లు, నిద్రవేళలు కచ్చితంగా పాటిస్తారు.
- ఈగల్ సౌండ్ డిజైన్‌కే ఆరునెలలు పట్టింది. యూరప్‌లో రియల్ గన్స్‌తో షూట్ చేసి ఆ సౌండ్‌ని రికార్డ్ చేశాం. అలాగే పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సహకారం మరువలేనిది. ఒక్క ఫోన్ కాల్ చేస్తే చాలు కావలసిన వనరులు సమకూర్చేవారు.
- ఈ చిత్రంలో నవదీప్ నటన ఆశ్చర్యపరుస్తుంది. అనుపమా పరమేశ్వరన్ కథను ముందుకు నడిపించే పాత్రను పోషించారు. త్వరలో తేజ సజ్జతో ఓ చిత్రం చేస్తున్నాను.

ట్రూ లవర్ ఈ వాలెంటైన్ విన్నర్



మణికందన్, శ్రీ గౌరి ప్రియ, కన్న రవి ప్రధాన తారాగణంగా రూపొందిన తమిళ చిత్రం 'ట్రూ లవర్'. ఈ ప్రేమకథా చిత్రానికి ప్రభురామ్ వ్యాస్ దర్శకత్వం వహించారు. దర్శకుడు మారుతి, నిర్మాత ఎస్‌కేఎన్ ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ నెల 10న 'ట్రూ లవర్' విడుదలవుతోంది. గురువారం చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఎస్‌కేఎన్ మాట్లాడుతూ 'తమిళ ప్రీమియర్స్ చూసిన వాళ్లు ఈ మధ్యకాలంలో ఇలాంటి సినిమా రాలేదని చెబుతున్నారు. తెలుగువాళ్లకూ ఈ సినిమా బాగా నచ్చుతుంది. పెయిడ్ ప్రీమియర్స్ వేస్తున్నాం. మణికందన్, గౌరీప్రియ నటన ఆకట్టుకుంటుంది. ఈ సినిమా ఈ వాలెంటైన్ డే విన్నర్ అవుతుంది. 'బేబీ' హిందీ రీమేక్‌లో నేను నటించడం లేదు' అని తెలిపారు. మారుతి మాట్లాడుతూ 'ట్రూ లవర్' కథను దర్శకుడు సహజంగా తెరకెక్కించాడు. దర్శకుడి ప్రతిభ అబ్బురపరుస్తుంది. ప్రేమికులే కాదు కుటుంబం అంతా కలసి చూసే సినిమా ఇది' అన్నారు. మణికందన్ మాట్లాడుతూ 'పక్కా స్క్రీన్‌ప్లేతో తీసిన సినిమా ఇది. ఇక్కడి ప్రేక్షకులు నన్ను తెలుగు నటుడిగానే చూస్తున్నారు. మారుతి, ఎస్‌కేఎన్ రిలీజ్ చేయడం వల్ల ఈ సినిమా స్థాయి పెరిగింది' అని చెప్పారు. శ్రీ గౌరి ప్రియ మాట్లాడుతూ 'ఈ చిత్రం తమిళ ప్రీమియర్స్‌కు ప్రేక్షకుల నుంచి చక్కటి స్పందన వస్తోంది. తెలుగులో సూపర్ హిట్ అవుతుందని నమ్ముతున్నాం' అన్నారు.

నవ్వించే గూఢచారి



హాస్య నటుడు వెన్నెల కిశోర్ హీరోగా నటించిన 'చారి 111' చిత్రం మార్చి ఒకటిన విడుదల కానుంది. టీజీ కీర్తికుమార్ దర్శకత్వంలో అదితి సోని నిర్మించిన సినిమా ఇది. సంయుక్త విశ్వనాథన్ హీరోయిన్‌గా నటించారు. కన్‌ఫ్యూజ్ అయ్యే గూఢచారిగా వెన్నెల కిశోర్ కనిపిస్తారని దర్శకనిర్మాతలు చెప్పారు. 'ఇదొక స్పై యాక్షన్ కామెడీ సినిమా. సిల్లీ మిస్టేక్స్ చేసే గూఢచారి ఒక పెద్ద కేసుని ఎలా పరిష్కరించాడన్న అంశంతో చిత్రాన్ని రూపొందించాం. వెన్నెల కిశోర్, సంయుక్త గూఢచారి పాత్రలు పోషించారు. వాళ్ల బాస్‌గా మురళీశర్మ కీలక పాత్ర చేశారు.' అని దర్శకుడు చెప్పారు. గూఢచారి చిత్రాల్లో 'చారి 111' కొత్తగా ఉంటుందని నిర్మాత తెలిపారు. త్వరలో పాటలు, ట్రైలర్‌ను విడుదల చేస్తామని చెప్పారు.

లవ్ జిహాద్ డ్రిల్



అమెరికాలో డాక్టర్‌గా సెటిల్ అయిన హరనాథ్ పొలిచర్ల సినిమా మీద మమకారంతో ఇండియా వచ్చి చిత్రాలు తీస్తుంటారు. స్వీయ దర్శకత్వంలో ఆయన నిర్మించిన తాజా చిత్రం 'డ్రిల్' ఈ నెల 16న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సినిమా టీజర్‌ను విడుదల చేశారు. సంగీత దర్శకుడు ఆర్.పి.పట్నాయక్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై హరనాథ్ మరెన్నో సినిమాలు తీయాలనీ, 'డ్రిల్' చిత్రం విజయవంతం కావాలనీ కోరారు. డాక్టర్ హరనాథ్ మాట్లాడుతూ 'నాకు చిన్నప్పటి నుంచి సినిమాలంటే ఇష్టం. ఆ కారణంగానే ఇప్పటివరకూ ఎనిమిది సినిమాలు తీశా. అమెరికాలో డాక్టర్ వృత్తిలో ఎంత బిజీగా ఉన్నా ఎప్పటికప్పుడు సినిమా అప్డేట్స్ తెలుసుకుంటుంటాను. లవ్ జిహాద్ మీద తెలుగులో ఇంతవరకూ ఒక్క సినిమా కూడా రాలేదు. అందుకే ఆ కాన్సెప్ట్‌తో స్క్రిప్ట్ రెడీ చేసుకుని ఇండియాకు వచ్చి సినిమా తీశా. ఇంతవరకూ నేను చేసిన సినిమాలకు ఇది భిన్నంగా ఉంటుంది' అన్నారు. కారుణ్య చౌదరి హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో భవ్య, సిషిగంధ, తనికెళ్ల భరణి, జెమినీ సురేశ్, కోటేశ్వరరావు, సత్తన్న, విశ్వ , జబర్దస్త్ ఫణి తదితరులు నటించారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/xepzBEN లో చదవండి.

రచ్చబండలో... సమస్యల వినతి

● ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్న షర్మిల



రచ్చబండ కార్యక్రమంలో సమస్యలను వింటున్న షర్మిల

తెనాలి రూరల్, ఫిబ్రవరి 8: మండలంలోని కొలకలూరులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమానికి గురువారం కాంగ్రెస్ ఏపీ చీఫ్ షర్మిల హాజరయ్యారు. ప్రజల నుంచి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వ్యవసాయం చేయాలంటే రైతులకు గుండె ధైర్యం చాలడంలేదని వాపోయారు. ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోవడంలేదన్నారు. వ్యవసాయంలో లాభాలు రాకపోగా పెట్టుబడులు కూడా రాలేదు. తుపాను వచ్చి పంటలు నీటమునిగి నష్టం వాటిల్లితే కనీసం ఆదుకున్న వారు కూడా లేరంటే ఇక రైతుకు ధైర్యం చెప్పేవారెవరూ వారి మనుగడ కాపాడేదెవరంటూ పలువురు రైతులు వైఎస్ షర్మిల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టకముందు పాదయాత్రలో జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయాన్ని పండుగగా చేయిస్తానని రైతులను రాజులు చేస్తానని ఎన్నో మాటలు చెప్పి తమకు ఆశలు రేకెత్తించారన్నారు. తీరా అధికారంలోకి వచ్చిన తరువాత వ్యవసాయానికి అవసరమైన నీటిని కూడా సకాలంలో అందించలేదన్నారు. పంట, మురుగు కాలువల పూడిక తీసి, గడ్డిజాతి మొక్కలను నివారించి కాలువల్లో మరమ్మతులు కూడా చేపట్టలేదని దారుణంగా రైతులను ముంచిన ప్రభుత్వాలు మునుపెన్నడూ చూడలేదన్నారు. కొలకలూరుకు చెందిన పాప మాట్లాడుతూ ఎమ్మెల్యే శివకుమార్‌ను తమకు నివేశన స్థలాల పట్టాలు రాలేదని ఇప్పించమని పలుమార్లు అడిగామని ఇంతవరకు తమకు పట్టాలు అందించిందే లేదని ఆరోపించారు. సైలమ్మ అనే మహిళ మాట్లాడుతూ తాను దాదాపుగా నాలుగు సంవత్సరాల నుంచి పింఛన్, రేషన్ కోసం అర్జీలు పెడుతూనే ఉన్నానని ఏదో ఒక కారణం చెబుతూ వాటిని అందకుండా చేశారని, వాటికోసం తిరిగి తిరిగి విసుగు చెందినట్లు తెలిపారు. గ్రామంలో తాగునీటి కోసం ఎదురు చూస్తున్నామని, డ్రెయినేజీ వ్యవస్థ కూడా లేదని పలువురు తెలిపారు. వ్యవసాయ గ్రామమైన తమ గ్రామానికి వెళ్లే డొంకరోడ్లు అధ్వానంగా ఉన్నాయని కాలువలు పూడికలు తీయకపోవడంతో తుపాను వంటివి వస్తే ఆ నీరు బయటకుపోక పంట నష్టపోతున్నామని, పంట బీమా, సబ్సిడీలు కూడా అందడంలేదని గ్రామంలోని రైతుల చిట్టిబాబు తెలిపారు. అదే విధంగా పార్వతి అనే మహిళ తెనాలి నుంచి కొలకలూరు రావడానికి నరకంగా ఉందని అందుకు రోడ్లు దుస్థితి కారణమన్నారు. రోడ్లు అధ్వానంగా ఉండటంతో అనేక ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని గత రాత్రి స్కూల్ ఆటో ప్రమాదానికి గురైందని తెలిపారు. జీఎం కాంతారావు మాట్లాడుతూ 46 సంవత్సరాలుగా రేషన్ షాపు నడుపుతున్నానని తెలిపారు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత తహసీల్దార్ రవిబాబు, వీఆర్వో రాంబాబులు, ఎంపీటీసీల మాట విని గ్రామంలో బియ్యం పంపిణీలో జరగని అక్రమాలు జరిగాయంటూ తన రేషన్‌షాప్ డీలర్‌షిప్‌ను నిలిపివేశారని ఆరోపించారు.

ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత తమవంటి నిజాయితీపరులకు అడుగడుగునా అవమానాలంటూ ఆమె ముందు ఆవేదన వ్యక్తంచేశారు. రాజకీయాల్లో హోదా ఉన్న వారికి డీలర్‌షిప్ ఇవ్వకూడదని నిబంధనలు ఉన్నా గ్రామంలో ఎంపీటీసీ పదవి ఉన్న వ్యక్తులకు రేషన్ డీలర్‌షిప్ ఇచ్చారని ఇది నిబంధనలకు విరుద్ధంగా ఉన్నా ప్రభుత్వ యంత్రాంగానికి కనిపించడంలేదని వాపోయారు. గొర్రెలు, పశు పోషకులకు కూడా ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందటంలేదని మరొకరు లేవనెత్తారు. రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని ప్రభుత్వం చెబుతుందని తాము పంట పొలాల్లో పనులు చేసుకునే సమయంలో వేలిముద్ర వేయాలంటూ అక్కడి సిబ్బంది ఫోన్‌చేసి పిలిపించుకుంటున్నారు. తీరా అక్కడికి వెళ్లాక సర్వర్ రావడం లేదంటూ తిప్పిపంపుతున్నారని మరో రైతు చెప్పారు. భవన నిర్మాణ కార్మికుల రంగం తీవ్రంగా దెబ్బతిందని మరోవ్యక్తి షర్మిలకు వివరించారు. ఇలా దాదాపుగా 20 మందికి పైగా రచ్చబండలో షర్మిల ముందుకు పలు సమస్యలను తీసుకువచ్చారు.



వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న షర్మిల



వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న నాదెండ్ల

రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది

● పీఏసీ చైర్మన్ మనోహర్

తెనాలి క్రైం, ఫిబ్రవరి 8: ప్రస్తుత ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం పట్టణంలోని 17వ వార్డులో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాదెండ్ల మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అసలైన లబ్ధిదారులకు అందడం లేదన్నారు. కనీసం పట్టణ శివారు ప్రాంతాల్లో తాగునీటి సమస్య కూడా తీర్చలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. రాష్ట్రంలో సంక్షేమ అభివృద్ధి జోడెడ్లులాగా ఉంటేనే రాష్ట్రం ముందుకు సాగుతుందన్నారు. కనీస సౌకర్యాలు, మౌలిక వసతుల కల్పన అనేది వైసీపీ ప్రభుత్వం మర్చిపోయిందన్నారు. ఈ ప్రభుత్వంలో ధరల పెరుగుదల, పన్నుల భారం, సామాన్యుల వెన్నువిరుస్తున్నాయన్నారు. రాష్ట్రాన్ని గతంలో ఎన్నడూ లేనివిధంగా అప్పుల ఊబిలోకి నెట్టిన ఘనత జగన్‌కే దక్కుతుందని తెలిపారు. రానున్న జనసేన, తెలుగుదేశం ప్రభుత్వంలో తెనాలి నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వస్తానని ఈ పొత్తును నిండు మనస్సుతో పట్టణ ప్రజలు ఆశీర్వదించాలని నాదెండ్ల కోరారు. కార్యక్రమంలో తెనాలి నియోజకవర్గ జనసేన నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

రుణాలను సక్రమంగా చెల్లించాలి

● డీఆర్‌డీఏ ఏపీఎం ప్రియదర్శిని



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ ఏపీఎం ప్రియదర్శిని

కొల్లిపర, ఫిబ్రవరి 8: బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించాలని డీఆర్‌డీఏ ఏపీఎం ప్రియదర్శిని అన్నారు. గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో డ్వాక్రా మహిళలతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ప్రియదర్శిని మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపు సభ్యులు పొదుపును సక్రమంగా చేసుకుంటే అధికంగా రుణాన్ని పొందటానికి అవకాశం ఉందన్నారు. డ్వాక్రా గ్రూపు సభ్యులు ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలకు మాత్రమే బ్యాంకు రుణాలను వినియోగించాలన్నారు. స్వయం సహాయక సంఘ సభ్యులు ప్రతి నెలా సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. అదేవిధంగా సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవడం వలన సంఘాలు మరింత బలోపేతం అవటానికి అవకాశం ఉందన్నారు. సమావేశంలో సీసీలు ఎమ్. శోభారాణి, ఎస్. యుగంధర్, ఎమ్. నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 8: పట్టణంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని గురువారం అరెస్టు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాలాజీరావుపేటలో విశ్వసనీయ సమాచారం మేరకు అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముక్కాముల రాంబాబును అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్టు తెలిపారు.



చిత్రలేఖన పోటీలను పర్యవేక్షిస్తున్న బాలరామ్, శ్రీనివాసరావు

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 8: విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకత వెలికి తీసేందుకు చిత్రలేఖన పోటీలు దోహదపడతాయని కాంటినెంటల్ కాఫీ లిమిటెడ్ జనరల్ మేనేజర్ పి.బాలరామ్ చెప్పారు. ఎన్జీవో కళ్యాణ మండపంలో, రామకృష్ణ కవి కళాక్షేత్రంలో గురువారం ఆంధ్రా ప్యారిస్ డ్రాయింగ్ ఈవెంట్ నిర్వహించారు. పట్టణంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు 600మంది చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిత్రాన్ని గీయాలంటే ఎంతో ఓర్పు, నేర్పు అవసరమన్నారు. ఈ లక్షణాలు ఉన్న విద్యార్థులు జీవితంలో రాణిస్తారని, పోటీల్లో విజేతలకు ఈ నెల 10న కాంటినెంటల్ కాఫీ చైర్మన్ చల్లా రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామన్నారు. రోడ్డు సేఫ్టీ అండ్ ట్రాఫిక్ సిగ్నల్స్ అనే అంశంపై పోటీ నిర్వహించారు. 35వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలలో భాగంగా నిర్వహించిన కార్యక్రమాన్ని తెనాలి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యుడు సునీల్ పర్యవేక్షించారు. వైష్ణవి కళాశాల ప్రిన్సిపల్ పాటిబండ్ల శ్రీనివాసరావు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అచ్యుత సాంబశివరావు, విజయప్రకాష్, వెంకటేశ్వరరావు, మస్తాన్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

హరినామ సంకీర్తనలు

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 8: తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ వారి ఆదేశాల మేరకు గురువారం పట్టణానికి చెందిన శ్రీఅన్నమయ్య భజన మండలి వారు తిరుమలలో హరినామ సంకీర్తనలను నిర్వహించారు. కార్యక్రమంలో టీం లీడర్ కారంపూడి రమాదేవి, సంకీర్తన బృంద సభ్యులు మాదాల అర్చన, తూనుగుంట్ల దుర్గామల్లేశ్వరి, అందె రాజేశ్వరి, వాసవి, నాగలక్ష్మీ, అందె తన్మయి, నరసింహ, రూపశ్రీ, అందె మాలచంద్రమౌళిఉమామహేశ్వరావులు పాల్గొన్నారు. వీరి బృందానికి టీటీడీ వారు సుపథం ద్వారా ప్రత్యేక వసతి, దర్శనం ఏర్పాటు చేశారు.



ఆహారం పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కొనసాగుతున్న అన్న క్యాంటీన్ సేవలు

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 8: పట్టణంలోని మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పేదప్రజల కోసం నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లకు దాతల సహకారం అభినందనీయమని టీడీపీ నాయకులు అన్నారు. స్థానిక మార్కెట్ సెంటరులోని అన్న క్యాంటీన్‌లో గురువారం ఎన్నారై విద్యా సంస్థల యాజమాన్యం సహకారంతో పేదలకు అన్నదానం చేశారు. శివాజిచౌక్‌లో అన్నక్యాంటీన్‌లో ఆలపాటి రాజా దంపతుల సహకారంతో పేదలకు ఆహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాదల కోటేశ్వరరావు, వెనిగళ్ళ శివప్రసాద్, గుమ్మడి ప్రసాద్, సోమవరపు సాంబశివరావు, గోగినేని రమేష్, క్రొత్తపల్లి రమేష్, ముళ్ళపూడి వెంకట్, అక్కిశెట్టి వెంకటేశ్వరావు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



శాశ్వత ఆటోనగర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన ఉస్మాన్ మేస్త్రీని అభినందిస్తున్న కార్మికులు

శాశ్వత ఆటోనగర్ సంఘ అధ్యక్షుడిగా ఉస్మాన్

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 8: పొన్నూరు పట్టణంలోని శాశ్వత ఆటోనగర్ యూనియన్ అధ్యక్షుడిగా ఎండీ ఉస్మాన్ గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలో జరిగిన కార్యక్రమంలో గురువారం యూనియన్ ఎన్నిక జరిగింది. 185మంది సభ్యత్వం గల యూనియన్‌లో ఉస్మాన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఉస్మాన్ మాట్లాడుతూ అందరి సహకారంతో త్వరలోనే శాశ్వత ఆటోనగర్ నిర్మాణం ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఆటోనగర్ పరిధిలోని జీవనం సాగిస్తున్న ప్రతి ఒక్కరికి సొంత స్థలంలో దుకాణాలు నిర్మించుకునేలా తమ కృషి ఉంటుందని తెలియజెప్పారు. సమావేశంలో ఉస్మాన్‌ను సహచర కార్యవర్గ సభ్యులు, కార్మికులు ప్రత్యేకంగా అభినందించారు.

మహాత్మాగాంధీ ఆశ్రమంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న రమణయ్య

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 8: బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మాగాంధీ వృద్ధాశ్రమంలో, నాజరుపేట మనఇల్లు, గాంధీనగర్ షిరిడి సాయి ఆశ్రమాల్లో గురువారం అన్నదానం చేశారు. శ్రీవేంకటేశ్వర యోగా కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సయ్యద్ అహ్మద్ హుస్సేన్, మాజీ సర్పంచ్ శివనాగేశ్వరరావు, ముద్దాభక్తుని రమణయ్య, యేసుబాబు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 8 : సాయి ప్రసాద సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం పేదలకు అన్నదానం చేశారు. చినరావూరులో జరిగిన కార్యక్రమంలో లక్కరాజు సాయి, శ్రీనివాసరావు, సురేష్ పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలను పరిష్కరించండి: తహసీల్దార్

చేబ్రోలు, ఫిబ్రవరి 8: రెవెన్యూ పెండింగ్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్ని తహసీల్దార్ ఈ రమాదేవి ఆదేశించారు. చేబ్రోలు మండల పరిధిలోని వీఆర్వోలతో గురువారం సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ దరఖాస్తులు, భూ సర్వే తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. తక్షణమే పెండింగ్ దరఖాస్తులను పూర్తి చేయాలన్ని వీఆర్వోలను ఆదేశించారు. కార్యక్రమంలో వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 8: రామలింగేశ్వరపేటలోని గురవయ్య కాలనీలో గురువారం పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. పాస్టర్‌గా సేవలు అందించిన దేవరపల్లి రత్నం కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టిటస్, పీటర్‌పాల్, ప్రసాదకుమారి తదితరులు పాల్గొన్నారు.



వల్లభరావుపాలెం గ్రామంలో రైతుకు బీమా పరిహారం అందచేస్తున్న సంగం అధికారులు

పాడి రైతులకు సంగం డెయిరీ భరోసా

● పాలకవర్గ సభ్యుడు బొర్రు రామారావు

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి 8: పాడి రైతులకు సంగం పాలకవర్గం డీవీసీ అభయ ద్వారా భరోసా కల్పిస్తుందన్ని ఆ సంస్థ పాలకవర్గ సభ్యులు బొర్రు రామారావు అన్నారు. మండల పరిధిలోని అప్పికట్ల చిల్లింగ్ సెంటర్ పరిధిలో వల్లభరావుపాలెం, ములుకుదురు గ్రామాలలోని రైతులకు గురువారం పశుబీమా పరిహారం పంపిణీ జరిగింది. వల్లభరావుపాలెం గ్రామం పాల సొసైటీ పరిధిలో పాల ఉత్పత్తిదారుడు కొండ్రబోలు చంద్రమౌళి పశువు ఇటీవల మృతిచెందింది. సంగం డీవీసీ పశు సంక్షేమ పథకం ద్వారా చంద్రమౌళికి రూ.60వేలు పరిహారం మంజూరైంది. అలాగే ములుకుదురు పాల ఉత్పత్తిదారు యడవల్లి విజయలక్ష్మి పశువు మృతి చెందగా పశు సంక్షేమ పథకం ద్వారా రూ.లక్ష పరిహారం మంజూరైంది. ఈ రైతులకు పాలకవర్గ సభ్యులు బొర్రు రామారావు పరిహారం అందించారు. కార్యక్రమంలో చిల్లింగ్ సెంటర్ మేనేజర్ కాట్రు నరేష్‌బాబు, సూపర్‌వైజర్లు గంగాధర్, బాలకిషోర్, వెటర్నరీ డాక్టర్ మణిరత్నం, సొసైటీ అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేపు సంస్కృత కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 8: 110ఏళ్ల చరిత్ర కలిగిన గంగానమ్మపేటలోని కోటా లక్ష్మయ్యనాయుడు సంస్కృత కళాశాల ఎంతో చరిత్ర కలిగి ఉందని, ఆ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం శనివారం జరుగుతుందని ఆహ్వాన కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం పెన్షనర్స్ హాలులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, గంగానమ్మపేటలోని కోటా లక్ష్మయ్యనాయుడు సంస్కృత కళాశాల ఎంతో చరిత్ర కలిగి ఉందన్నారు. పెన్షనర్స్ హాలులో నిర్వహించే పూర్వ విద్యార్థుల సమావేశానికి పలువురు పూర్వ విద్యార్థి సంఘాలను సమాయత్తం చేశామని చెప్పారు. ఇక్కడ పని చేసిన అధ్యాపకులు, ప్రిన్సిపాల్స్‌ను ఆహ్వానించామని, చదివిన విద్యార్థులంతా హాజరు కావాలని కోరారు. కమిటీ సభ్యులు వినాయకరావు, మురళీకృష్ణ, రామలింగేశ్వరరావు, అప్పారావు, శర్మ, శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.



వాకింగ్ ట్రాక్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి

పనులు త్వరితగతిన పూర్తిచేయాలి

● అధికారులను ఆదేశించిన కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

పెదకాకాని, ఫిబ్రవరి 8: పెదకాకాని గ్రామంలో ఎంపీ లాడ్స్ నిధులతో చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి సీపీవో శేషశ్రీతో కలిసి రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి పార్లమెంట్ నిధులతో నిర్మించిన ఆళ్ల దశరథ రామిరెడ్డి వాకింగ్ ట్రాక్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెదకాకానిలో 25ఎకరాల తాగునీటి చెరువు చుట్టూ వాకింగ్‌ట్రాక్, ఫెన్సింగ్ చేసేందుకు ఎంపీ లాడ్స్ నిధులు నుంచి 40లక్షల రూపాయల వ్యయంతో 1.245 కి.మీ వాకింగ్ ట్రాక్‌కు కేటాయించారు. అలాగే 30లక్షలతో గైడ్‌వాల్‌ను, ఫెన్సింగ్‌ను పెయింటింగ్ పనులకు కేటాయించినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్.ఈ సురేష్ తెలియజేశారు. చెరువు కట్టను పటిష్టపరచి గైడ్‌వాల్‌ను నిర్మించడం జరిగిందని కలెక్టర్‌కు తెలియజేశారు. ఇంకా 16 లక్షల పనులు పురోగతిలో ఉన్నాయని జిల్లా కలెక్టర్‌కు తెలియజేశారు. కార్యక్రమంలో సీపీవో శేషశ్రీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్.ఈ సురేష్, ఏఈ శివరామకృష్ణ, పెదకాకాని తహసీల్దార్ రత్నం, ఎంపీడీవో మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పెదకాకాని శివాలయం నూతన డీసీగా వరప్రసాదరావు



శ్రీరామ వరప్రసాదరావు

పెదకాకాని, ఫిబ్రవరి 8: పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానం నూతన డిప్యూటీ కమిషనర్‌గా డి.శ్రీరామ వరప్రసాదరావు గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా దేవదాయ శాఖలో డీసీ క్యాడర్‌కు జరిగిన ప్రమోషన్లు, బదిలీల్లో భాగంగా పెదకాకాని దేవస్థానానికి ఈయనను నియమించారు. దీంతో ఆయన ప్రస్తుత ఆలయ ఇన్చార్జి ఈవో ఎన్.శ్రీనివాస రెడ్డి నుంచి ఆలయ ఈవోగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకవర్గ సభ్యులతో కలిసి మరింత సౌకర్యంతమైన వసతులు, ఏర్పాట్లకు తగు చర్యలు తీసుకుంటామని అని తెలిపారు.

జయహో బీసీ సభను విజయవంతం చేయాలి: మైలా

చేబ్రోలు, ఫిబ్రవరి 8: జయహో బీసీ సభను విజయవంతం చేయాలని చేబ్రోలు మండల అధ్యక్షుడు మైలా వెంకటరామరాజు కోరారు. గురువారం చేబ్రోలు టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో రామరాజు మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన పెదకాకానిలో టీడీపీ, జనసేన సంయుక్త ఆధ్వర్యంలో జయహో బీసీ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సభకు నియోజకవర్గంలోని బీసీలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాల్సిందిగా కోరారు. ఈ సభ ద్వారా వైసీపీ ప్రభుత్వం బీసీలకు చేసిన అన్యాయాన్ని ప్రజలకు వివరించనున్నట్లు చెప్పారు. సమావేశంలో టీడీపీ నాయకులు, అనంత లక్ష్మీనారాయణ, వీరంకి రంగారావు, ఉయ్యూరు శ్రీనివాసరావు, గోడుగున్నూరి శ్రీనివాసరావు, తాటి శంకర్, కందే శ్రీనివాసరావు, తోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా సినిమా టికెట్ల పంపిణీ

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 8: పొన్నూరు పట్టణంలో గురువారం యాత్ర - 2 సినిమా టికెట్లను ఉచితంగా పంపిణీ చేయటం చర్చనీయాంశంగా మారింది. వైసీపీకి మేలు జరిగేలా కథాంశంతో యాత్ర-2 సినిమాను రూపొందించారు. యాత్ర - 2 సినిమా గురువారం విడుదల కావటంతో ఉదయం వైసీపీ నాయకులు పట్టణంలో సందడి చేశారు. ఐతే మొదటి 1, 2షోలు వైసీపీ నాయకులు, కార్యకర్తలు టికెట్లు కొనుక్కొని సినిమాను వీక్షించారు. ఫస్ట్ షో, సెకెండ్ షోకు టికెట్లు కొనే సాధారణ ప్రేక్షకులు లేకపోవటంతో ఏంచేయాలో పాల్పోని ఓ మైనార్టీ నాయకుడు గంపగుత్తగా సొంత డబ్బుతో టికెట్లు కొన్ని పట్టణంలోని పలు కూడళ్లలో మనుషులను పెట్టి స్ట్రీట్ వెండర్లు, దారినపోయే వారికి టికెట్లను ఉచితంగా పంపిణీ చేసి సినిమాకు వెళ్లాలని కోరారు. ప్రజల ఆదరణ లేకపోవటం వల్లనే టికెట్లు ఉచితంగా పంపిణీ చేస్తున్నారని ప్రతిపక్ష నాయకులు విమర్శిస్తున్నారు.

వీఆర్‌ఏల సమస్యల పరిష్కారానికి సంఘం తీర్మానం

చేబ్రోలు, ఫిబ్రవరి 8: వీఆర్‌ఏల సమస్యల పరిష్కారానికి ఐక్యమత్యంతో ముందుకు సాగుదాం అని వీఆర్‌ఏల సంఘం తీర్మానించింది. గురువారం చేబ్రోలులో వీఆర్‌ఏల నాయకులు చంద్రమౌళి, అంకయ్య ఆధ్వర్యంలో చేబ్రోలు మండల వీఆర్‌ఏ యూనియన్ ఏర్పాటు చేశారు. మృతిచెందిన వీఆర్‌ఏలకు నివాళులు అర్పించారు. పని ప్రదేశాలలో వీఆర్‌ఏలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇతర సమస్యలపై చర్చించారు. త్వరలోనే కార్యవర్గ ఎన్నిక భవిష్యత్ కార్యాచరణ నిర్దేశించుకోనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు క్రమశిక్షణ, దేశభక్తి అవసరం

● హైకోర్టు జడ్జి మన్మధరావు



హైకోర్టు జడ్జి మన్మధరావును సన్మానిస్తున్న స్కూల్ ఎండీ మురళీకాంత్, ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 8: విద్యార్థులలో క్రమశిక్షణ, దేశభక్తి ఉండాలని, సమాజం ఎదుర్కొంటున్న రుగ్మతలను భావి పౌరులే తొలగించాల్సి ఉంటుందని హైకోర్టు జడ్జి మన్మధరావు చెప్పారు. బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ స్వర్ణోత్సవ వేడుకల్లో గురువారం జరిగిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ, సెల్‌ఫోన్‌తో కాలక్షేపం చేస్తే ఇతర ఆలోచనలు వస్తాయని, చదువుకు దూరం అవుతారని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎంతవరకు వినియోగించుకోవాలో అంతవరకే వాడుకోవాలని, తల్లిదండ్రులు తమ పిల్లల బాధ్యతలను ఉపాధ్యాయులపై వదిలేసి ఊరుకోవడం సరికాదన్నారు. పిల్లల ఆలోచనలను, ప్రవర్తనను తల్లిదండ్రులు గమనిస్తుండాలని ఆధునిక సమాజం పోకడలు విద్యార్థుల ప్రవర్తనను మార్చేస్తాయన్నారు. ఉత్తమ పౌరులుగా రూపొందేందుకు లక్ష్యాన్ని ఏర్పాటుచేసుకుని అందుకు అనుగుణంగా ముందుకు పోవాలని, పోటీ ప్రపంచంలో రాణించాలంటే నైపుణ్యాలు అవసరమన్నారు. సౌత్ ఇండియా లీడ్ స్కూల్ డైరెక్టర్ లోలక్ మాట్లాడుతూ, గూగుల్ వినియోగం బాగా పెరిగిపోయిందని, అన్ని విషయాలు గూగుల్ చూసి అభిప్రాయాలు రూపొందించుకోవడం కాకుండా గ్రంథాలను పరిశీలించాలన్నారు. స్వర్ణోత్సవ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. స్కూల్ వ్యవస్థాపకులు దాసరి ప్రకాశరావు, రంగలక్ష్మి, ఎండీ మురళీకాంత్, ఈడీ గీతాకాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

ఉద్యోగుల వివరాలు అప్లోడ్ చేయాలి: కలెక్టర్

గుంటూరుసిటీ, ఫిబ్రవరి 8: రానున్న సార్వత్రిక ఎన్నికలలో విధులు నిర్వహించేందుకు అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను ఎన్నికల సంఘం నిర్దేశించిన పోర్టల్‌లో నిర్ణీతగడువులోపు అప్లోడ్ చేయటానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. గురు వారం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్‌శంకరన్ సమావేశ హాల్లో పోలింగ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ పోర్టల్‌లో ఉద్యోగుల వివరాల నమోదుపై అవగాహన కోసం జిల్లా అధికారులకు (డీడీవో) నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధులు కేటాయింపు కోసం జిల్లాలోని అన్ని శాఖల ఉద్యోగుల వివరాలను పోలింగ్‌పర్సన్స్ మేనేజ్మెంట్ సిస్టమ్ పోర్టల్‌లో తప్పనసరిగా నమోదు చేయాలన్నారు.